శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## కావలికి తలమానికంగా ఏరియా వైద్యశాలను తీర్చిదిద్దుతా !



**కావలి, ఆగస్టు 3 ప్రభాతవార్త :** కావలికి తలమానికంగా ఏరియా వైద్యశాలను తీర్చిదిద్ది పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేలా అహర్నిశలు పాటుపడతానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి(కావ్య కృష్ణారెడ్డి) తెలిపారు. శనివారం కావలి ఏరియా వైద్యశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం జరిగిన హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన చైర్మన్‌గా వ్యవహరిస్తూ ఎమ్మెల్యే కావ్య మాట్లాడారు. వైద్యుల ఆత్మస్థైరాన్ని దెబ్బతీసేలా ఎవరు వ్యవహరించవద్దని హెచ్చరికలు చేశారు. డాక్టర్లకు అన్ని విధాలుగా అండగా వుంటానని హామీ ఇచ్చారు. కావలి ఏరియా వైద్యశాలలో అనుభవం కలిగిన నిష్ణాతులైన వైద్యులు, సిబ్బంది వున్నారన్నారు. పేదలకు వారు అందిస్తున్న సేవలు బేష్ అని కితాబు ఇచ్చారు. దాదాపు 900 మంది రోగులు ప్రతి నిత్యం వైద్యశాలకు వచ్చి వైద్యం అందుకుంటున్నారన్నారు. వైద్యశాలపై నమ్మకం కలిగించేలా సిబ్బంది పనితీరు వుండాలన్నారు. ఈ వైద్యశాలలో పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. వాటిని పరిష్కరిస్తానన్నారు. ఏరియా వైద్యశాలకు అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలు కొనుగోలుకు కృషి చేస్తామన్నారు. చిన్నచిన్న సమస్యల్ని పెద్దవి చేసి చూపుతూ వైద్యుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయవద్దన్నారు. నిత్యం సేవ చేస్తూ ప్రజలకు అందుబాటులో వుంటున్న వైద్యులపై దుష్ప్రచారం చేయవద్దన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా వైద్య సిబ్బందికి అండగా వుంటానన్నారు. ఈ వైద్యశాలలో అభివృద్ధి కమిటీ నిఘాతో పాటు పర్యవేక్షణ వుంటుందన్నారు. వైద్యశాలలో ఏవైనా సమస్యలు వుంటే అభివృద్ధి కమిటీ దృష్టికి తేవాలన్నారు. డాక్టర్లు దైవంతో సమానమన్నారు. దేవుడు తర్వాత దండం పెట్టేది డాక్టర్లకేనన్నారు. వైద్యో నారాయణో హరి అన్న అర్థానికి వమ్ము చేయకుండా వైద్యులు అంకితభావంతో, చిత్తశుద్ధితో పనిచేసి రోగుల ప్రశంసలు అందుకోవాలన్నారు. ఈ వైద్యశాలలో రోగులకు కార్పొరేట్ వైద్యం అందించేలా వైద్యుల పనితీరు వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ పి.పద్మావతి, ఆర్‌యంవో జి.ప్రమీల, నర్సింగ్ సూపరింటెండెంట్ ప్రసూన, వైద్యశాల మాజీ సూపరింటెండెంట్, ఐయంఎ అధ్యక్షుడు డాక్టర్ కామంచి సుబ్బారావు, ఐయంఎ గౌరవ సలహాదారుడు, అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ బెజవాడ రవికుమార్, అభివృద్ధి కమిటీ సభ్యులు చవల రామకృష్ణ, పొబ్బా సాయివిఠల్, ఏటూరి శివకుమార్, ఆత్మకూరి నాగలక్ష్మి, జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అలహరి సుధాకర్, టిడిపి కావలి పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని వైద్యశాల బాధ్యులు ఘనంగా సత్కరించారు.

## వ్యాదులపై పోరాడేందుకు సరికొత్త ఆవిష్కరణలు రావాలి

### ఎపిఎస్‌ఎసిఓఎన్ 2024లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపి
### కొత్త టెక్నాలజీపై ప్రజలు అవగాహన కల్పించడం ముఖ్యం
### నిత్యం నేర్చుకుంటేనే ముందుకు సాగుతాం



**నెల్లూరు రూరల్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** వ్యాధులపై పోరాడేందుకు సరికొత్త ఆవిష్కరణలు, టెక్నాలజీ అవసరమని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. కొత్త టెక్నాలజీతో రోగులను కాపాడేందుకు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. నెల్లూరు నగరంలోని అనిల్ గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన అసోసియేషన్ ఆఫ్ పల్మోనాలజిస్ట్స్ ఆఫ్ సీమాంధ్ర కాన్ఫిరెన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతిని వెలిగించిన ఎంపి వేమిరెడ్డి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ 5వ రాష్ట్రస్థాయి సమావేశానికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇందుకు కార్యనిర్వాహక కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఊపిరితిత్తుల ఆరోగ్యం, దాని సంబంధిత వ్యాధులు, వాటికి చికిత్స చేయడానికి కొత్త టెక్నాలజీపై ప్రజలను అవగాహన కల్పించడానికి ఈ సమావేశం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇలాంటి సదస్సులు వైద్య రంగానికి మంచి సపోర్ట్ ఇస్తాయని, కొత్త టెక్నాలజీని పంచుకోవడానికి కూడా సహకరిస్తాయన్నారు. ప్రస్తుతం లాంగ్ క్యాన్సర్, ఆస్తమా, న్యుమోనియా, సిఒపిడి, ఇటీవల వచ్చిన కోవిడ్ 19 ద్వారా ప్రపంచం సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. కోవిడ్ 19 వల్ల వైద్య వ్యవస్థ ఎలా ఇబ్బందులు పడిందో ప్రతి ఒక్కరికీ తెలుసునని, అందువల్ల యువ డాక్టర్లు సరికొత్త చికిత్సా విదానాలను అన్వేషించాలని సూచించారు. ఊపిరితిత్తులు వ్యాధుల పై గ్రామీణ ప్రాంతాల్లో అంతగా అవగాహన లేదని, కాబట్టి వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కాన్ఫరెన్స్ గొప్ప ఆవిష్కరణలకు వేదిక అవుతఉందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సావరిన్‌కు ఆవిష్కరించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రని అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, ఏపిఎస్ఏసిఓఎన్ వ్యవస్థాపకులు, అసోసియేషన్ సభ్యులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో శనివారం పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి అభిషేక పూజలను ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాన్నిభక్తమండలి ఆధ్వర్యంలో కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో 1.26 కోట్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త :** కందుకూరు మున్సిపాలిటలో శనివారం శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. క్లబ్ రోడ్డు దగ్గర శిలాఫలకం ఆవిష్కరణ చేశారు. క్లబ్ రోడ్డు నుంచి ఆది ఆంధ్ర కాలనీ వరకు 16.65 లక్షలతో తారు రోడ్డు నిర్మాణం, మధ్యలో వాగుపై 1.1 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులకు ఆవిష్కరణలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ రోడ్డు అధ్వాన్నంగా మారడంతో ఈ ప్రాంత ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో ఎన్నికలకు ముందు స్వయంగా చూశాను. వర్షం కురిసినప్పుడు ఈ చుట్టు పక్కల పొలాల్లో నీళ్లన్నీ వాగులోకి చేరటం వలన రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. అందుకే మొదటి ప్రాధాన్యతగా ఈ రోడ్డు పనులు చేపట్టడం జరిగింది. గత టీడీపీ ప్రభుత్వంలోనే బ్రిడ్జికి నిధులు మంజూరైన, వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పనులు చేయలేదు. వర్షాలు కురిసినప్పుడు పట్టణంలో పలు కాలనీలు ముంపుకు గురవుతున్నాయి. వర్షపు నీరు నిల్వ ఉండే 50 ప్రాంతాలను గుర్తించి, అక్కడ సమస్య తొలగిపోయేలా ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. మళ్లీ వర్షాలు కురిసే లోపే ఈ పనులన్నీ పూర్తి చేస్తాం, కందుకూరు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. త్వరలో మున్సిపాలిటీకి ఎన్నికలు జరగబోతున్నాయని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారం చేసి పట్టణ ప్రజల మనసులు గెలుచుకుంటామన్నారు. కందుకూరు నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ సానుకూలంగా ఉన్నారని నాగేశ్వరరావు తెలిపారు. అదే ప్రాంతంలో రాళ్లవాగును ఎమ్మెల్యే పరిశీలించారు. వాగులో నీళ్ల క్రింది వైపుకు వెళ్లే అవకాశం లేదని, వర్షాకాలంలో వాగు పొంగి ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయని స్థానికులు తెలుపగా, నీరు అవుట్ ఫ్లో కోసం ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమీషనర్ కృష్ణారెడ్డికి ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పట్టణ మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు ఉన్నం భాస్కర్, పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య, నల్లూరి సుబ్బారావు, ముచ్చు శ్రీను, చిలకపాటి మధు, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, వడ్డేళ్ల రవిచంద్ర, అల్లం వెంకటేశ్వర్లు, మహర్షి శ్రీను, ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.

## టి.టి.డి జె.ఇ.ఓతో ఎమ్మేల్యే కురుగోండ్ల రామకృష్ణ భేటి



**రాపూరు, ఆగష్టు3ప్రభాతవార్త :** తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ అధికారి(జె.ఇ.ఓ) వెంకయ్య చౌదరిని శనివారం వెంకటగిరి ఎమ్మేల్యే కురుగోండ్ల రామకృష్ణ భేటి అయ్యారు. తిరుమలలోని జెఇఓ కార్యలయంలో వెంకయ్య చౌదరిని కలసిన ఎమ్యేల్యే కురుగోండ్ల రామకృష్ణ ఆయనకు శాలువా కప్పి,బోకే అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలో పలు దేవాలయల నిర్మాణాలకు సంబందించిన విషయాలను ఆయనతో చర్చించి నియోజకవర్గం అభివృద్ధికి సహకారం అందించాలని జె.ఇ.ఓను ఎమ్మేల్యే కోరారు.

# రాష్ట్రం అబివృద్ధి వైపు పయనం

### దేవాదాయ,ధర్మదాయశాఖ మంత్రి ఆనం



**చేజర్ల ఆగష్టు 3 ప్రభాతవార్త :** గత వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని కోలుకోలేని స్దాయిలో అప్పుల ఉబిలోకి నెట్టిందని అయినప్పటికి ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రస్తుతం రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పయనింపు చేసేలా అన్ని చర్యలు చేపడుతుందని రాష్ట్ర దేవాదాయ,ధర్మదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్బంగా శనివారం చేజర్ల మండలం పెరమళ్ళపాడు గ్రామంలో వున్న రామనారాయణరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆత్మ కూరు నియోజకర్గం పరిధిలోని సంగం,ఎఎస్‌పేట మండలాల తెలుగుదేశం పార్టీ నేతలు,కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆ యన మాట్లాడుతు రాబోయే స్దానిక సంస్దల ఎన్నికల లో ఎన్‌డిఎ అభ్యర్దులు గ్రామాలలో అన్ని స్దానాలు కైవశం చేసుకునేలా ఇప్పటి నుండే కృషి చేయాలని కోరారు. గ్రామ సర్పంచ్‌లు ,ఎంపిటిసి,జడ్‌పిటిసి అన్ని ప్రణాళిక బద్దంగా గెలిచేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. అలాగే త్వరలో జరగనున్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో ఆత్మకూరు నియోజకర్గాన్ని అగ్రగామిగా నిలపాలని కోరారు. ఆత్మకూరు నియోజకర్గంలోని అన్ని గ్రామాలలో ఎన్‌డిఎ అభ్యర్దులను కలుపుకోని గ్రామ కమీటిలు ఏర్పాటు చేసి ప్రతి లబ్దిదారునికి అభివృద్ధి పలాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. అన్ని గ్రామాలలో 6:4 నిష్పత్తిలో గ్రామాబివృద్ధి కమీటిలు ఉంటాయని అన్నారు. 6 మంది సభ్యులు తెలుగుదేశం పార్టీకి 4 గురు సభ్యులు బిజెపి,జనసేకు ఉంటారని ఆయన తెలిపారు. ఆత్మకూరు నియోజకర్గంలో ఎమ్మేల్యేగా రెండోవసారి గెలిపించి రాష్ట్రంలో 6 వసారి మంత్రి పదవిని అందించడంతో సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి శాఖను నిర్వహించడం బృహత్తర బాగ్యమని ఆయన పేర్కొన్నారు. తనకు రాష్ట్ర స్దాయిలో ఈ శాఖను అప్పగించిన చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రానికి కేంద్రంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి 15 వేల కోట్ల రూపాయాలను అందించందని తెలిపారు.పోలవరం ప్రాజక్టులకు నిధులు ఇస్తామని హామి ఇచ్చారని అన్నారు.రాష్ట్రంలో పెన్షన్లు ప్రభుత్వ అధికారుల చేత 1 వ తేదిన 95 శాతం లబ్దిదారుల ఇంటికి వెళ్లి నగదు అందిస్తున్నామని తెలిపారు. పింఛన్లుకు రెండోవ నెల 2 వేల 7 వందల కోట్ల రూపాయాలు అందజేసిందని గుర్తు చేశారు.ప్రభుత్వ ఉద్యోగస్తులందరికి 1,2 తేదిలలో జీతాలు అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. అలాగే సోమశిల ప్రాజక్టు ఆప్రాన్ మరమ్మత్తులు చేపట్టాలని అధికారులకు సూచించామని అన్నారు. సంగం,ఎఎస్‌పేట మండలాలలో ఉన్నసమస్యలను గ్రామ నాయకులు ఆయన దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగింది. అన్ని సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తామని నాయకులకు హామి ఇచ్చారు. అత్యధిక మెజర్టీగా వచ్చిన సంగం మండలం నాయకుల్ని కార్యకర్తలను ఆయన అభినందించారు. సంగం,ఎఎస్‌పేట మండలాల బూత్‌ల వారిగా స్దానిక సంస్దల ఎన్నికల ఓట్లు వివరాలు అడిగి తెలుసుకున్నారు .గతం కంటే ఇప్పుడు ఆత్మకూరు నియోజవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని అన్నారు.ఈకార్యక్రమంలో రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి,ఆత్మకూరు నియోజకర్గం సీనియర్‌నాయకులు తాళ్ళూరు గిరినాయుడు, మాజీ జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి , జనసేన నియోజకర్గం ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీదర్,సంగం, ఎఎస్‌పేట మండలాల నాయకులు పాల్గోన్నారు.

# అంగరంగ వైభవంగా 219వ గంద మహోత్సవం



**ఉదయగిరి,ఆగష్టు 03,ప్రభాతవార్త:** నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరిలో ముస్లిం సోదలందరూ మతసామరస్యంతో జరుపుకునే గంధ మహోత్సవానికి అతిరథ మహారథులు పాల్గొన్నారు. ముఖ్యంగా నెల్లూరు జిల్లా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ హ.రత్ ఖైవాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ కదిరి ఔలియా వారి 219వ గంధం మహోత్సవం కార్యక్రమానికి రావడం తమ అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. గంధమోర్చానికి విచ్చేసిన వీరికి దర్గా మాత పెద్దలు ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వదించారు.అనంతరం వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మతసామరస్యంతో జరుపుకునే గంధ మహోత్సవ కార్యక్రమంలో ఉదయగిరి ప్రజలు తమను ఆహ్వానించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు.ఉదయగిరి గడ్డ మతసామ్రాజ్యానికి పెట్టింది పేరని ముస్లింలు సోదరుల నిర్వహించే ప్రతి పండగలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం ఇక్కడ ప్రత్యేకత అని అన్నారు.శాసనసభ్యులు కావ్యకృష్ణ రెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గం అల్లా దయతో రాబోయే రోజుల్లో అభివృద్ధి దిశగా శాసనసభ్యులు కాకల సురేష్ ఆధ్వర్యంలో పరుగులు పెడుతుందని అన్నారు.ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ మాట్లాడుతూ మతసామ్రాజ్యంతో జరుపుకునే మైలానా ఖదిరి సాహెబ్ గంధ మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిపిస్తున్న ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.ముస్లిం సోదరులు చుట్టుపక్కల నుంచి వచ్చే ముస్లిం సోదరులందరికీ గంధమోత్సవం సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు రియాజ్ సంధాని పాల్గొన్నారు.ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు జరుగుతుందని ప్రతి ఒక్కరికి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని హిందువులు ముస్లింలు అందరూ కలిసి వచ్చి గంధ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని అల్లా ఆశీర్వాదాలు పొందాలని అన్నారు

# తల్లిదండ్రుల ను గౌరవించాలి : సైనికుల సేవలను గుర్తించాలి



**నెల్లూరు,ఆగష్టు3 ప్రభాతవార్త–విద్య :** మనకు జన్మనిచ్చి, మనకోసం జీవితాన్ని త్యాగం చేసే తల్లిదండ్రులను కడదగా గుర్తుంచుకోవాలని అలాగే దేశం కోసం ప్రాణాలను సైతం అర్పించే వీర సైనికుల సేవలను గుర్తించాలని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని స్థానిక డికె బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉచిత పాఠ్య,నోట్‌బుక్ ్స, స్కూల్‌బ్యాగ్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వ సహాయంతోపాటూ ఆ కాళాశాలలో విద్యను అబ్యసించిన పూర్వ విద్యర్థులు కూడా కళాశాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ , ఆర్‌ఐఓ డాక్టర్ ఆదూరుశ్రీనివాసులు మాట్లాడుతు తమ కళాశాలలో ప్రభుత్వం స్కిల్‌హబ్‌ను ఏర్పాటుచేయటం సంతోషంగా ఉందన్నారు. అడి ్మషన్ల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎంపిసీ, బైపిసీ, సిఈసి గ్రూపుల్లో మూడు అదనపు సెక్షన్స్‌ను మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. అలాగే కళాశాల ,హాస్టల్ భవనాల్లో అదనపు గదుల ఏర్పాటుకై సహకరించాలని ఆయన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీదర్‌రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో డివిఈఓ మదుబాబు, మాజీ మేయర్ భానుశ్రీ, తెలుగుదేశం రాష్ట్ర ప్రధాన కార్యదరి ్శ రాజా నాయుడు, పూర్వ విద్యారు ్థల సంఘం అధ్యక్షులు జ్యోతి, కార్యదర్శి కుసుమకుమారి, జయలక్ష్మీ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరిని కలిసిన న్యాయవాది సాయిప్రసాద్



**కావలి రూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త :** కందుకూరు నియోజకవర్గంలో అఖండ విజయం సాధించిన శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావును జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, న్యాయవాది ఇసకల సాయిప్రసాద్ శనివారం మర్యాదపూర్వ కంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కావలి నియోజకవర్గంలోని పలు విషయాలు వీరి వద్ద చర్చకు రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు చంద్రశేఖర్‌రెడ్డి, సాయిక్రిష్ణ, లోక్‌అదాలత్ సభ్యుడు యం.మాలకొండారెడ్డిలు పాల్గొన్నారు.

## కావలి ఎమ్మెల్యే కావ్యను ఆహ్వానించిన వీరబ్రహ్మయ్య స్వామి దంపతులు



**కావలి, ఆగస్టు 3 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం రాజువారిచింతలపాళెంలో వేంచేసి వున్న శ్రీశ్రీశ్రీ విజయదుర్గ ఆస్థాన పీఠం 29వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పీఠం శాశ్విత ధర్మకర్త, వాస్తు సిద్ధాంతి పత్రి వీరబ్రహయ్యస్వామి,ఆయన సతీమణి సుజాత దంపతులు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని కలిసి ఆహ్వానించారు. శనివారం ముసునూరులోని కావ్య నివాసానికి వెళ్లారు. వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను వారు ఎమ్మెల్యేకు అందజేశారు. విశిష్ట అతిథిగా వార్షికోత్సవ వేడుకలలో పాల్గొనాలని బ్రహ్మయ్యస్వామి దంపతులు కోరారు. ఈ నెల 16వ తేది వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యేకు తెలిపారు.

# నారాయణలో తల్లిపాల ఆవశ్యకత పై అవగాహన




**నెల్లూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త – వైద్యం :** నారాయణ హాస్పిటల్‌లో చిన్న పిల్లల వ్యాధుల విభాగం, కాన్పులు గర్భకోశ వ్యాధుల విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి. హరిప్రసాద్ రెడ్డి, నారాయణ డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ రెజినాల్డ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి. హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు నెల 1వ తేది నుండి 7వ తేది వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు జరుపుకుంటారని, అందులో భాగంగానే ఈ రోజు నారాయణ మెడికల్ కాలేజి హాస్పిటల్ నందు ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను జరుపుకోవడం జరుగుతందని తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. అలాగే ఇప్పుటి వరకు నారాయణ మాతృ సేవా పథకం ద్వారా ఉచిత సేవలు పొందుతున్న గర్భిణీ స్త్రీలకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మరికొన్ని ఉచిత దంత వైద్య సేవలను కూడా అందుబాటులోకి తీసుకునిరావడం జరిగిందని తెలిపారు. అనంతరం నారాయణ డెంటల్ కాలేజి ప్రిన్సిపాల్ డా. అజయ్ రెజినాల్డ్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు కొన్ని రకాల దంత సమస్యలు రావడం జరుగుతుందని, నారాయణ మాతృ సేవా పథకంలో సేవలు పొందుతున్న గర్భిణీ స్త్రీలకు ఓపి రిజిస్ట్రేషన్, గారపట్టిన పళ్లను శుభ్రం చేయడం, కదలిన పళ్లను తొలగించడం, పిప్పి పళ్లకు సిమెంట్ పెట్టడం తదితర సేవలన్నింటికి ప్రసవం అయ్యేవరకు, ప్రసావానంతరం ఒక సంవత్సరం పాటు ఉచితంగా దంత సంరక్షణ సేవలను అందిస్తామని, అలాగే పుట్టిన బిడ్డకు కూడా ఐదు సంవత్సరాల వయస్సు వచ్చే వరకు ఉచిత దంత సంరక్షణ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే నారాయణ మాతృ సేవా పథకంలో భాగస్వామ్యులు చేసినందుకు డాక్టర్ హరిప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గైనకాలజి విభాగాధిపతి డాక్టర్ ప్రసన్న మాట్లాడుతూ తల్లిపాలు త్రాగడం వలన రోగనిరోధక శక్తి పెరుగుతుందని, విరేచనాలు, జ్వరం, మెదడువాపు వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తల్లిపాలు ఇవ్వాలని, పెద్దవారైన తరువాత కూడా జబ్బుల భారి నుండి రక్షించేందుకు రోగనిరోధక శక్తి ఎంతో అవసరమని అందువలన బిడ్డకు పాలిచ్చే తల్లులు సరైన పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. నారాయణ హాస్పిటల్ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ రవీంద్రనాధ్ రెడ్డి మాట్లాడుతూ చాలామంది తల్లులు బిడ్డకు పాలు ఇస్తుంటే విరేచనాలు అవుతున్నాయని, వాంతులు అవుతున్నాయని, చిన్న చిన్న కారణాల వలన బిడ్డకు పాలు ఇవ్వడం ఆపేస్తుంటారు. ఇది సరైనది కాదు. విరేచనాలు అవుతుంటే డాక్టర్‌ని సంప్రదించాలి తప్ప బిడ్డకు పాలు ఇవ్వడం మానకూడదన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది తల్లిపాల ఆవశ్యకత గురించి నాటక రూపంలో ప్రదర్శన ఇచ్చారు. అలాగే క్విజ్ ప్రోగ్రామ్లో గెలుపొందిన వారికి అతిధుల చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో నారాయణ హాస్పిటల్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. హరీష్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్ కాంత్, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనజ కుమారి, నారాయణ హాస్పిటల్ ఏజిఎం ఏసి శేఖర్ రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ శ్రీవాణి, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో ప్రయోజనకరం



**ఆత్మకూరు, ఆగస్ట్3, ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణంలో ఇటీవల నూతనంగా ప్రారంభించిన అవినాష్ దంతవైద్యశాల ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరెంటెంట్ డాక్టర్ శేషారత్నం హాజరయ్యారు. వైద్యశిబిరాన్ని రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వైద్యశాలను ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాల వలన పేద ప్రజలకు వైద్యం ఉచితంగా అందుతుందని , ఇటువంటి వైద్యశిబిరాలను మరింతగా పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ అవినాష్ ప్రభుత్వ దంత వైద్యులుగా తమ వైద్యశాలలో కొనసాగుతు ఉద్యోగ విరమణ అనంతరం ఈప్రాంతంలోని ప్రజలకు తమ వైద్యసేవలు అందించడం సంతోషకరమన్నారు. శిబిరంలో పాల్గొన్నవారికి డాక్టర్ అవినాష్ వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్యచికిత్సలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ప్రభుత్వ దంత వైద్యునిగా 32సంవత్సరాలుగా పనిచేసిన అనుభవంతో తన సొంత ప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గంలో తాను వైద్యశాలన ఏర్పాటు చేశామన్నారు. తమ అవినాష్ దంతవైద్యశాల ఆధ్వర్యంలో ఇతర మండలాల్లో ప్రతి నెలా ఒక ఉచిత మెగా దంతవైద్యశిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. ఈవైద్యశిబిరంలో సుమారు 100మందికి పైగా దంత సమస్యలకు వైద్యం చేశామన్నారు. అనంతరం డాక్టర్ శేషారత్నంను డాక్టర్ అవినాష్ సన్మానించారు.

## శనివారం ఆదాయం రూ.6.9లక్షలు



**వలేటివారిపాలెం ఆగస్టు 3, ప్రభా తవార్త :** మండలంలోని మాలకొం డ నందలి శ్రీమాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వారిని శనివారం పలువురు భక్తులు దర్శించు కున్నారు.తద్వారా సా ్వమివారికి రూ 6,94,971లు మేర ఆదాయం సమకూరింది. ఆలయ ప్రధాన అ ర్చకులు గౌరీ భక్తులకు తీర్ధప్రసాదాలు అ ందచేశారు.భక్తుల సందర్శనతో స్వామివారికి అష్టోత్తర పూజల వలన రూ.4,850లు, కుంకుమార్చన పూజల ద్వారా రూ. 20,040లు,తలనీలాలు టిక్కెట్లు వలన రూ. 28,450లు,వాహనపూజల వలన రూ.2,880లు, ప్రత్యేక దర్శనం రూ.1,52,600లు, స్దలపురాణం పుస్తకముల అమ్మకం వలన రూ.760లు,రూముల అద్దెలు రూ.27,910లు,కవర్లు అమ్మకం వలన రూ.3,600లు,అన్నదానం నిమిత్తం రూ.2,85,841లు లడ్డుప్రసాదం అమ్మకాల వలన రూ. 1,68,040లు చొప్పున స్వామి వారికి భక్తులు సమర్పించారు. ఆలయ డిప్యూటీ కమీషనర్ కె.బి శ్రీనివాసరావు భక్తులకు దర్శన ఏర్పాట్లును పర్యవేక్షించారు.వలేటివారిపాలెం ఎస్సై మహేంద్రనాయక్,సీఐ నజీర్‌బాషా తదితరులు స్వామివారిని దర్శించారు.

## చదవాలనుకునేవారికి సదావకాశం



**కలువాయి ఆగష్టు 3 ప్రభాతవార్త** మండలంలోని చీపినాపి జడ్‌పి ఉన్నత పాఠశాల నందు బడి మద్యలో మానివేసిన వారు తిరిగి చదవాలనుకునే వారికసదావకాశం కల్పిస్తున్నామని పాఠశాల ప్రధానో పాధ్యాయులు,ఉపాధ్యాయులు తెలియ జేశారు. 2024,2025 సంవత్సరం దూర విద్యా విధానం ద్వారా 10, ఇంటర్ మీడియట్ అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయని వారు తెలిపారు. సమాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వారు పది ఫైల్ అయిన వారు కనీసం విద్యా అర్హత కావాలనుకునేవారికి,ఆసక్తి వున్న వారు తగ్గిన విద్యార్హత లేదని చింతించే వారికి సువర్ణ అవకాశం కల్పిస్తు ఓపన్ స్కూల్ విదానంలో పదో తరగతి చేరాలనుకునే వారు 14 సంవత్సరాలు వయస్సు కల్గి ఉండాలని వారు తెలిపారు. ఎటువంటి విద్యార్హతలు లేకున్నా జనన దృవీకరణ పత్రం,రికార్డు షీట్,బదలీ సర్టిఫికేటుతో నమోదు చేసుకోవాలని అన్నారు.15 సంవత్సరాలు వయస్సు కలిగి ఓపన్ స్కూల్ విధానంలో ఇంటర్‌మీడియట్‌లో నమోదు కావచ్చు నని తెలిపారు.పాసు అయిన తదుపరి రెగ్యులర్ ఏ డిగ్రీ అయిన పూర్తి చేయవచ్చునని,ఆదార్ జెరాక్స్,పాసుపోటో,ప్రాధమిక విద్యా దృవీకరణలతో ఎ1,కో ఆర్డినేటర్లు సంప్రదించాలని తెలిపారు. నమోదు అయిన వారికి ఉచితంగా పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందని రెండోవ శనివారం ఆదివారం క్లాసులు నిర్వహించబడునని తెలిపారు.నమోదు అగుటకు ఆగష్టు 27 వ తేది చివరి అవకాశం అని,అదనపు రుసుంతో సెప్టెంబర్ 4 వరకు ఉంటుందని అందుకు సంబంధించిన కరపత్రాలను పాఠశాల సిబ్బంది, శనివారం విడుదల చేశారు.

## ప్రజా శ్రేయస్సు ధ్యేయం



**ఉలవపాడు, ఆగష్టు 3, ప్రభాతవార్త :** ప్రజలకు ఆరోగ్య, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని సర్పంచ్ మానికల నాగలక్ష్మీ పేర్కొన్నారు. వర్షాకాలం పారిశుద్య వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రమైన ఉలవపాడులో స్టేట్ బ్యాంకు నుండి ఊరి చివరి ఉన్న వైన్ షాప్ వరకు డ్రైనేజీలోని పూడిక తీతను తీయడం, రోడ్డుకి ఇరువైపులా బ్లీచింగ్‌ను చల్లించడం జరిగింది. పంచాయతీ కార్యదర్శి విజయమ్మ పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు వరం



**వింజమూరు, ఆగస్ట్3, ప్రభాతవార్త :** తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యవరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాత పేర్కొన్నారు. శనివారం మండలంలోని బుక్కాపురం సచివాలయ పరిధిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. బుక్కాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.వెంకటేశ్వర్లురెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు తాగించాలన్నారు. తల్లిపాలలో అధిక పోషకపదార్థాలుంటాయని , బిడ్డకు 2సంవత్సరాల వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మహేశ్వరి, పద్మ, పద్మకుమారి, జ్యోతి, పద్మప్రసన్న, ఎఎన్ఎంలు కాశమ్మ, ఎంఎల్‌హెచ్‌పి మాళవి, గర్భవతులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

## జిఒ నెంబర్ 77ను రద్దు చేయాలి



**వింజమూరు, ఆగస్ట్3, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం పిజి విద్యార్థులకు గుదిబండలా మారిన జిఒ నెంబర్77ను రద్దుచేసి ఫీజ్ రీయంబర్స్‌మెంట్‌ను అందజేయాలని ఆంధ్ర విద్యార్థి సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వింజమూరులోని బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తెచ్చిన జిఒ నెంబర్77 వలన విద్యార్థులు అనేక విధాలుగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం విద్యాశాఖామంత్రి నారా లోకేష్ ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే జిఒ నెంబర్ 77ను రద్దుచేసి పిజివిద్యార్థులకు ఫీజ్ రీయంబర్స్‌మెంట్‌ను అందజేస్తామన్న హామీని అమలు చేయాలన్నారు . రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని, హాస్టల్స్‌లో మౌళిక సదుపాయాలు కల్పించి పక్కా భవనాలను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో విద్యార్థులను , యువతను భాగస్వామ్యం చేసి టెక్నాలజీ పరంగా, పారిశ్రామికంగా ముందుకు తీసుకు వెళ్ళాలన్నారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు సృజన్ గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ చెరుకూరు ఖాజావలి, విద్యార్థి సంఘ నాయకులు ఆజాద్, ఖాజామస్తాన్, భాను, మణికంఠ , విద్యార్థులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటికి ఎంపికైన చందన



**మర్రిపాడు, ఆగస్ట్3, ప్రభాతవార్త :** మండలంలోని పోలిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం జరిగిన 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన చందన 2వ విడత కౌన్సిలింగ్‌లో ఒంగోలులోని ట్రిపుల్‌ఐటి లో సీటు సాధించిందని ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యా యుడు హరి తెలిపారు. చందనను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు అభినందించారు.

## ఎన్‌టిఆర్ ఆటో నగర్ ఏర్పాటుకు కృషి చేయాలి



**వింజమూరు, ఆగస్ట్3, ప్రభాతవార్త :** వింజమూరు పట్టణ పరిధిలో ఆటోనగర్, ఎన్‌టిఆర్ నగర్ ఏర్పాటు చేయాలని తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు శనివారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వింజమూరులో ఆటోమొబైల్స్ వర్క్స్ కోసం ఆటోనగర్ ఏర్పాటు చేయాలని కోరారు. మెకానిక్ , వృత్తిపనులు చేసుకుంటు సొంత షెడ్డులేక అద్దె భవనాల్లో ఉన్నారని వారి భవిష్యత్ బాగుపడేందుకు కృషి చేయాలన్నారు. రాఘవేంద్ర ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాలు గతంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న వారికి , డ్రైవర్లకు, టైలర్లకు, జర్నలిస్టులకు మంజూరు చేశారని, ఇప్పటివరకు ఆప్రాంతానికి రోడ్డు, నీటి వసతి లేక నిర్మాణాలు జరగలేదన్నారు. ఆప్రాంతాన్ని అభివృద్ధి చేసి ఎన్‌టిఆర్ నగర్ అని నామకరణం చేయాలన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి వెంటనే కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు గొంగటి రఘునాధరెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, గణపం సుదర్శన్‌రెడ్డి, జూపల్లి రాజారావ్ , కదిరి రంగారావ్, బండారు సత్యనారాయణ, విలేకర్లు గువ్వల రవీంద్రరెడ్డి, లెక్కల రాజేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుని కుటుంబానికి రాయుడు విరాళం



**వింజమూరు, ఆగస్ట్3, ప్రభాతవార్త :** వింజమూరు పంచాయతీ కార్మికునిగా పనిచేస్తున్న గంగపట్ల బాబు ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాబు కుటుంబానికి సర్పంచ్ నల్లగొండ్ల సృజన తన సొంత నిధులు 10వేల రూపాయలను అందజేశారు. ప్రభుత్వ పరంగా వచ్చే అన్ని రకాల ప్రయోజనాలను అందేలా కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో రాయుడు , కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కోనలో వైభవంగా శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం



**పెంచలకోన(రాపూరు), ఆగష్టు3 ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి కళ్యాణోత్సవం శనివారం పెంచలకోనలోని స్వామి వారి ఆస్థానమండపంలో వైభవంగా నిర్వహించారు. ఇందులో బాగంగా తెల్లవారుజామునస్వామి వారి మూలమూర్తికి అభిషేకం,పూలాంగి సేవ,గోపూజ నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారిని ఉభయదేవేరులతో కలసి శోబాయమానంగా ఆలంకరింప చేసిన తదుపరి వేదపండితులు వేదమంత్రోచ్చరణల మద్య స్వామి అమ్మవార్ల కళ్యాణం శాస్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి ఉత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని,స్వామి,అమ్మవార్ల కళ్యాణోత్సవాన్ని తిలకించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన వసతి ఏర్పాట్లను ఆలయ డిప్యూటీ కమీషనర్ కె. విజయ సాగర్ బాబు,ఇతర సిబ్బంది పర్యవేక్షించగా,స్వామి వారి పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు శశి స్వామి, మధు స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి తదితరులు భక్తి శ్రద్దలతో నిర్వహించారు.

## విదేశాలలో స్థిరపడ్డ పూర్వ విద్యార్థినుల్లారా అభివృద్ధికి సహకరించండి



**నెల్లూరు రూరల్, ఆగస్టు 3, ప్రభాతవార్త** నియోజకవర్గ పరిధిలోని డికెడబ్ల్యూ కళాశాలలో విద్యార్థినులకు నోట్ బుక్స్, బాగ్స్‌లను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మాజీ నగర మేయర్ నందిమండలం భాను శ్రీ, టీడీపి రాష్ట్ర కార్యదర్శి దొడ్డ పనేని రాజా నాయుడు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ డికెడబ్ల్యూ కళాశాలలో చదుకున్న పూర్వ విద్యార్థినుల్లారా దేశ విదేశాల్లో స్థిర నివాసం ఏర్పరచుకొని ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్న డికెడబ్ల్యూ కళాశాల పూర్వ విద్యార్థినుల్లారా ఈ కళాశాల అభివృద్ధికి సహకరించండి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడుతూ కన్నతల్లి పాదాలకు నమస్కారం చేయడం అలవాటు చేసుకోండి. విద్యార్థినులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సూచించారు. కళాశాల అభివృద్ధికి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పూర్తిగా సహకరిస్తున్నారు. డికెడబ్ల్యూ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వ సహకారంతో పాటు పూర్తి విద్యార్థినుల సహకారం కూడా ఎంత అవసరమని ఆయన అన్నారు.

## జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్లు నియామకం

**నెల్లూరు అర్బన్, ఆగస్టు 3, ప్రభాతవార్త** ఎట్టకేలకు ఎప్పుడు ఎపుడా అని వేచి చూస్తు ఉన్న నెల్లూరు జిల్లా ప్రజలకు తీపి కబురే వచ్చింది. ఎలక్షన్స్ సమయంలో జిల్లాలో అందరూ తహశీల్దారు ఎలక్షన్ డ్యూటీ సందర్భంగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఎలక్షన్ అయ్యి రెండు నెలలు అవుతున్నా గాని తహశీల్దార్లు మాత్రం ఆ సీట్‌లో రాలేదు. ఎట్టకేలకు ప్రభుత్వం నిర్ణయం మేరకు శనివారం జీవో విడుదల చేస్తూ, జిల్లాలోని మండల వారీలుగా తహశీల్దార్లను నియామకం చేసింది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా టి. విజయ్ కుమార్‌ను నియమించారు. డి, హెచ్ సెక్షన్లకు శాంతి కుమారుని సెక్షన్ తహశీల్దారులుగా, ఈ,ఎఫ్ సెక్షన్ తహశీల్దారుగా శ్రీనివాసులు రెడ్డిను, జి సెక్షన్ సుధాకర్ రావును ప్రభుత్వం నియమించింది.

## అత్యాచార బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బిజెపి నేత కందుకూరి



**కావలి, ఆగస్టు 3 ప్రభాతవార్త :** కావలి పట్టణ వెంగళరావునగర్‌లో అత్యాచారానికి గురైన మైనర్ బాలిక కుటుంబాన్ని బిజెపి రాష్ట్ర సంయుక్త కోశాధికారి, కందుకూరి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ కందుకూరి వెంకట సత్యనారాయణ శనివారం పరామర్శించారు. బాలిక తల్లి పర్వీన్‌ను కలిసి మాట్లాడారు. ప్రభుత్వం అన్ని విధాల వారిని ఆదుకోవాలని కందుకూరి కోరారు. కందుకూరి గార్మెంట్స్‌లో పనిచేస్తున్న పర్వీన్‌కు జీవనోపాధి కోసం కుట్టుమిషన్‌ను ఉచితంగా అందజేశారు. ఆమె ఇంటి దగ్గర కుట్టి వస్త్రాలన్ని ఫ్యాక్టరీకి పంపించవచ్చునని కందుకూరి తెలిపారు. కందుకూరి వెంట గార్మెంట్స్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నాయుడు రఘురామిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఆదాల



**నెల్లూరు రూరల్, ఆగస్టు 3, ప్రభాతవార్త** నియోజకవర్గంలోని 12వ డివిజన్‌లోని వావిలేటిపాడు గ్రామానికి చెందిన నాయుడు రఘురామిరెడ్డి కుటుంబ సభ్యులను నెల్లూరు రూరల్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి పరామర్శించారు. శనివారం సాయంత్రం ఆయన వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి వావిలేటిపాడులోని నాయుడు రఘురామిరెడ్డి నివాసం చేరుకుని ఇటీవల అనారోగ్యంతో మరణించిన నాయుడు రఘురామిరెడ్డి సతీమణి నాయుడు హైమావతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, హైమావతమ్మ మరణాన్ని గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారిలో నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రైల్వే బోర్డు సభ్యులు స్వర్ణ వెంకయ్య, మాజీ ఏఎంసి చైర్మన్ పేర్నాటి కోటేశ్వర రెడ్డి, మొయినుద్దీన్, నాగశ్రీనివాసులు రెడ్డి, బెల్లంకొండ వెంకయ్య, షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## విపిఆర్ నివాసంలో సంబరాలు



**నెల్లూరు రూరల్, ఆగస్టు 3, ప్రభాతవార్త** నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పబ్లిక్ అండర్ టేకింగ్స్ పార్లమెంటరీ కమిటీ సభ్యులుగా నియమితులైన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని నెల్లూరులోని విపిఆర్ నివాసంతో తెలుగుదేశం నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి కోటారెడ్డి, టిడిపి నాయకులు దవ్వూరు కళ్యాణ్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణా రెడ్డి, కాటంరెడ్డి రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రు.35కోట్లు కర్చుపెట్టినా గృహప్రవేశం జరగలేదు : కాకర్ల



**కలిగిరి, ఆగష్టు 3, ప్రభాతవార్త ;** నియోజకవర్గంలో జగనన్న కాలనీలకోసం ఇప్పటికి రు. 35కోట్లు కర్చు పెట్టినా ఒక్క లబ్దిదారుడు కూడా గృహ ప్రవేశం చేయలేదని ఉదయగిరి శాసన సబ్యులు కాకర్ల సురేష్ తెలిపారు. శనివారం కలిగిరి మండల సర్వసబ్య సమావేశం జరుగగా కాకర్ల ముఖ్యఅతిదిగా సర్వసబ్య సమావేశానికి హాజరైనారు. కలిగిరి మండలాద్యక్షురాలు మెట్టుకూరు శిరీషారెడ్డి అద్యతన జరిగిన ఈసమావేశంలో అదికారులు ప్రజాప్రతినిదులు పాల్గొ న్నారు .ఈసందర్భంగా మండల ఆరోగ్యశాఖ అదికారి మాట్లాడుతూ కలిగిరిలో ప్రభుత్వ ప్రజావైద్యశాల 24గంటల వైద్యశాలగా పనిచేస్తుందని అవసరమైనవారు ఏసమయంలో వచ్చినా వైద్యాదికారులు అందుబాటులో ఉంటారన్నారు. పశు వైద్యాదికారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చిన్న సన్నకారు రైతులకు కోళ్ల గొర్రెల పెంపకాలకు సంభందించి 90శాత సబ్సిడీలో రుణాలు మంజూరు చేస్తున్నారని అవసరమైనవారు ఈ అవకాశాలను ఉపయోగించుకోవచ్చన్నారు.మండల వ్యవసాయాదికారి మాట్లాడుతూ రైతులకు చ్చిరొట్టవిత్తనాలు అందజేశామని, బూసార పరీక్షలు నిర్వహించి రైతులకు తగుపంటలకు సంభందించి సూచనలు, సలహాలు అందజేస్తున్నారు.దీనిపై అక్కడేఉన్న ప్రజాప్రతినిదులు కలగజేసుకుంటూ ఈఅదికారి ఎవ్వరికీ పచ్చిరొట్టవిత్తనాలు ఇవవలేదని బూసార పరీక్షలు చేయలేదని యంఎల్‌ఏ దృష్టికి తెచ్చారు.విదంగా ఉపాదిహామీ అధికారి తమకు సహకరించలేదంటూ పలువురు యంఎల్ఏకి పిర్యాదులు చేశారు.మండలంలోని గంగిరెడ్డిపాళెం విఆర్ఓ పాస్‌పుస్తకాలకోసం ఒక్కోరైతువద్ద 10నుండి 20వేలవరకూ వసూలు చేస్తున్నారని అదేమని అడిగితే పైఅదికారులకు చెబితే పనులు చేయనని బెదిరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై మండల తాసిల్దారు స్పందిస్తూ అలాంటివి ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటానని రైతుపాస్‌పుస్తకాలకోసం ఎవరైనా నేరుగా తాసిల్దారును సంప్రదించాలన్నారు. పైసా కర్చులేకుండా పాస్‌పుఉస్తకాలు తీసుకోవాలన్నారు.అదేవిదంగా పిర్యాదులు వచ్చిన విఆర్ఓపై చర్యలు తీసుకుంటామన్నారు.మండల గృహనిర్మాణశాఖాధికారి మాట్లాడుతూ మండలంలో 24లేఅవుట్లు ఉన్నా చాలామంది ఇళ్లు నిర్మించుకోలేదని కొందరు బేస్‌మెట్‌లు వేసినా ఇళ్లు పూర్తి చేయలేదన్నారు.అయితే వచ్చే మార్చిలోగా బేస్‌మెట్లు వేసుకున్న లబ్దిదారులు ప్రభుత్వము ఇచ్చేరు. 1లక్షా80వేలుతో కాలనీలు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు.అలాచేయకుండా మద్యలో ఆపినా, బేస్‌మెట్‌వేసి ఆపినా వారికి మార్చి తరువాత ఒక్కరూపాయికూడా రాదన్నారు.అదేవిదంగా ఆవ్యక్తికి ఇకపై ఎలాంటి కాలనీలు మంజూరుకావన్నారు.ఇప్పటివరకూ ఇళ్లు నిర్మాణం చేపట్టని, ప్రభుత్వం నుండి లబ్దిదారునకు ఎలాంటి బిల్లుకానివారికి 2025 మార్చి తరువాత ముఖ్యమంత్రి గృహనిర్మాణానికి ప్రవేశపెట్టే రు4లక్షలు వర్తిస్తాయన్నారు.అనంతరం యంఎల్‌ఏ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గం ఎంతో వెనుక పడిన ప్రాంతమ్నారు. గతంలో పంచాయితీలకు నిదులువచ్చినా గత ప్రభుత్వం వేరే అవసారాలకు వాడుకుందన్నారు.టిడిపి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన యన్‌టిఆర్ సుజలస్రవంతి పదకం మూలన పడిందన్నారు. ఇప్పుడు దాని ఆచరణలోకి తీసుకురావడానికి 15కోట్లు అవసరమన్నారు. ఇదేవిషయం మంత్రుల దృష్టికి తీఉకెళ్లానని నిదులు రాగానే అన్నిగ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు.ఈదేవిదంగా సాగునీటికీ అదిక ప్రాదాన్యత ఇస్తానన్నారు.అదేవిదంగా గ్రామాలలో శానిటేషన్ అద్వాన్యంగా ఉందని అదికారులు శానిటేషన్‌పై దృష్టిపెట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని యంఎల్‌ఏ పిలుపునిచ్చారు.నియోజకవర్గంలో అనేక భూసమస్యలు తమ దృష్టికి వచ్చాయని సమస్యలు సృష్టించే ఏఅదికారినీ వదిలే ప్రసక్తే లేదన్నారు. అదికారులు బాద్యతతో పనిచేయాలన్నారు.అనంతరం మండల అబివృద్ధికి పాటుపడాల్సిందిగా యంపిపి యంఎల్‌ఏ దృష్టికి తేగా యంఎల్‌ఏ సానుకూలంగా స్పందించారు.ఈకార్యక్రమంలో జడ్పీటీసి సబ్యులు పాలూరి మాల్యాద్రిరెడ్డి, యంపిడిఓ రంగసుబ్బరాయుడు, మండల ఉపాద్యక్షులు యంపిటిసిలు, సర్పంచిలు అదికారులు పాల్గొన్నారు.

## ఏపిఓపై యంఎల్ఏకి పిర్యాదులు



**కలిగిరి, ఆగష్టు 3, ప్రభాతవార్త;** ఉపాదిహామీ మండల అధికారి సర్పంచిలకు కానీ, యంపిటిసి సబ్యులకు కానీ సహకరించకుండా ఒంటెద్దు పోకడలతో హవహరిస్తున్నారంటూ సబ్యులు యంఎల్‌ఏ దృష్టికి తెచ్చారు. శనివారం కలిగిరి మండల సర్వసబ్య సమావేశం జరుగగా ఏపిఓ మండలంలో నిర్వహించిన పనులపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కొందరు సర్పంచిలు, యంపిటసి సబ్యులు మూకుమ్మడిగా లేచి ఏపిఓపై యంఎల్ఏకి పిర్యాతులు చేశారు.గత పాలనలో తమను అనేక విదాలుగా ఇబ్బందులు పెట్టారని పంచాయితీలలో రిజర్వేషన్లులేకుండానే పనులు చేయించారని ఆరోపించారు.సర్పంచిలకు తెలియకుండానే గ్రామాలలో పనులు చేయించారంటూ అరోపించారు. దీనిపై యంఎల్‌ఏ స్పదించ్తూ ఏపిఓపై అదికంగా పిర్యాదులు వస్తున్నందున విచారించి చర్యలు తీసుకోవలసిందిగా యంపిడిఓకి తెలిపారు.

## అవయవదానంపై అవగాహన అవసరం



**నెల్లూరు, ఆగస్టు3 ప్రభాతవార్త-విద్య :** అవయవదానం పై విద్యారు ్ధల్లో అవగాన పెరగాల్సిన అవసరం ఉందని జిల్లా ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి, డికె జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. అవయవదాన దినోత్సవం సందర్భంగా శనివారం నగరంలోని స్దానిక డికె జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన ముఖ్యఅతిదిగా పాల్గొని మాట్లాడారు. అవయవ దానం చేయటం అంటే మరోకరికి ప్రాణదానం చేయటమే నని, తద్వారా అవయవదానం చేసిన వారు పునర్జీవులు అవుతారని పేర్కొన్నారు. అనంతరం డాక్టర ఎన్‌వి సుధీర్, డిఎస్‌ఓ బాస్కర్‌లు మాట్లాడుతు అవయవదానం, టిష్యూ దానాలపై పూర్తి సమాచారాన్ని విద్యారు ్ధలకు అందించారు. విద్యారు ్ధలు అడిగిన ప్రశ్నలకు వారు సమాదాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొండయ్య, కరుణకుమారి, ప్రసన్న, టి.బారతీ, వెంకటరావు, కృష్ణ తులసి, శ్రీధర్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ళ అరెస్ట్

**వింజమూరు, ఆగస్ట్3, ప్రభాతవార్త :** వింజమూరు మండలం ఊటుకూరు గ్రామ పొలాల్లో పేకాట శిబిరంపై వింజమూరు ఎస్ఐ కోటిరెడ్డి దాడి చేయగా పేకాట ఆడుతున్న 9మందిని పట్టుకున్నారు. వారి నుండి 27,770 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్ళను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరుస్తామని ఎస్ఐ తెలిపారు.

## మండలంలో జోరుగా జనసేన సభ్యత్వం



**కలువాయి ఆగష్టు 3 ప్రభాతవార్త** మండల జనసేన పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్దానిక బస్టాండ్ ఆవరణంలో పెద్దఎత్తున యువకులుపార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొని సభ్యత్వాలు చేయించారు.గతంలో 230 సభ్యత్వాలు నమోదు చేయగా ఈ ఏడాది 750 పైగా సభ్యత్వాలు చేయడం గమనార్హం సభ్యత్వ నమోదుకు ఆదార్‌కార్డు,నామిని ఆదార్‌కార్డు,పాసుపోటో ,పర్మినెంట్ పోన్ నెంబర్,5 వందల రూపాయాలు రుసుం చెల్లించి నమోదు ప్రారంభించారు.ప్రతి క్రియాశీలక సభ్యునికి జనసేన పార్టీ అధినాయకులు పవన్ కళ్యాణ్ అండగా నిలబడి ఆకుటుంబాలకు ఆర్థికంగా భరోసా ఇవ్వడం జరుగుతుందని ఈ సందర్బంగా నాయకులు పాల్గోన్నారు.ఈకార్యక్రమంలో జిల్లా అద్యక్షులు మనోహార్,వీరమహిళ తోకల ప్రవల్లిక, నాయకులు నరేష్,రామకిషోర్, హరిప్రసాద్,నాగయ్య,శ్రీహరి,సురేష్,శ్రీనాద్ తదితరులు పాల్గోన్నారు.

## కళాశాలలో విద్యార్దులకు నోటి పుస్తకాలు పంపీణి



**చేజర్ల ఆగష్టు 3 ప్రభాతవార్త** చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్దిని విద్యార్దులకు ప్రభుత్వం అందజేస్తున్న నోటి పుస్తకాల పంపిణీ శనివారం నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథు లుగా చేజర్ల మండలం టిడిపి అద్యక్షులు రావి లక్ష్మీ నరసారెడ్డి, సొసైటీ అద్యక్షులు బోదళ్ళ వీరరాఘవరెడ్డిపాల్గోని విద్యార్దులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతు ప్రభుత్వం పేద విద్యార్దులకు అందజేస్తున్న పాఠ్యపుస్తకాలను విద్యార్దులు సక్రమంగా వినియోగించుకొని ఉత్తమ ఫలితాలు సాదించాలని సూచించారు.ఈకార్యక్రమంలో కళాశాలప్రిన్సిఫల్ దుర్గా ప్రసాద్‌రావు, విద్యార్దిని, విద్యార్దులు,అద్యాపకులు పాల్గోన్నారు.

## శభాష్ మహిళా పోలీస్

**బిట్రగుంట, ఆగస్టు 3 ప్రభాతవార్త** బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీ వడ్డిపాళెంలో వారం రోజుల నుండి మాటలు రాని మూగ, మతిస్థిమితం లేక రోడ్డుపై తిరుగుతున్న సుమారు 35 సంవత్సరాల యువతిని జువ్వలదిన్నె సచివాలయ మహిళా పోలీస్ పెయ్యల స్రవంతి గుర్తించి శనివారం ముంగమూరులోని భవానీ ఎడ్యుకేషన్ సొసైటీ ఆదరణ కేంద్ర నిర్వాహకులకు అప్పజెప్పింది. మతిస్థిమితం లేని మహిళ సైగలతో తన భర్త ఇబ్బందులు పెట్టినట్లు మెడ కింద, వంటి మీద గాయాలు చూపించింది. త్వరలో మహిళ వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. కాగా మహిళా పోలీస్ ఎంతో సహృదయంతో, మానవతా దృక్పదంతో అక్కున చేర్చుకుని మతిస్థిమితం లేని మహిళను తమకు అప్పజెప్పారని వివరాలు తెలిసే వరకు తమ సంరక్షణలో వుంచుతామని ఆదరణ కేంద్ర డైరెక్టర్ కె.సింహాద్రిరావు తెలిపారు.



## తల్లిపాల వారోత్సవాలు

**బిట్రగుంట, ఆగస్టు 3 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాధరావుపేట 3వ అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్వైజర్ కె.విక్టోరియా రాణి తల్లి పాల ఆవశ్యతను గురించి తల్లులకు వివరించారు. బిడ్డ పుట్టిన గంట లోగా తల్లి పాలు తాగించాలని దాని వల్ల వ్యాధి నిరోధక శక్తి మెరుగవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్యం రూతమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మి, విజయ, ప్రశాంతి, అంగన్వాడీ హెల్పర్లు, తల్లులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా దంత వైద్యాన్ని అందించిన డాక్టర్ పవిత్ర



**కావలి రూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త** కావలి మున్సిపాల్టీ పరిధిలోని 16వ వార్డు బాలకృష్ణారెడ్డినగర్‌లోని యంపియుపి పాఠశాల నందు జిల్లా తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏగూరి చంద్రశేఖర్ కుమార్తె కావలి క్రిస్టియన్‌పేటలోని పవిత్ర డెంటల్, ఫేషియల్ ఈస్థటిక్ హాస్పిటల్ కాస్మోటిక్ డెంటల్ సర్జన్ క్లినికల్ కాస్మోటాలజిస్ట్ డాక్టర్ పవిత్ర ఏగూరి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాయిల శ్రీనువాసులు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు డాక్టర్ పవిత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, పేస్ట్, బ్రష్‌లు అందజేశారు. అలాగే బిస్కెట్ ప్యాకెట్లు కూడా పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ పవిత్ర ఏగూరి మాట్లాడుతూ కావలి, పరిసర ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఉచితంగా దంత వైద్యం అందించి దంత సమస్యలపై అవగాహన కల్పించాలన్నదే మా ధ్యేయమన్నారు. ప్రతి నెల ఏదో ఒక వెనుకబడిన ప్రాంతంలో ప్రజలకు ఉచిత దంత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి దంత పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. దంత సమస్యల వల్ల శరీరంలోని మిగిలిన అవయవాలలో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అందువల్ల దంత సమస్యలకు వైద్యం పొందాలన్నారు. గతంలో బిపి, షుగర్, గ్యాస్ట్రిక్ ట్రబుల్, గుండె సంబంధిత వ్యాధులు ఎక్కువ వచ్చేవి కావని ప్రస్తుతం 30 సంవత్సరాల దాటిన తర్వాత రావడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ద తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏగూరి చంద్రశేఖర్, 16వ వార్డు టిడిపి అధ్యక్షులు మాల్యాద్రి, 19వ వార్డు అధ్యక్షులు రమణయ్య, టిడిపి నాయకులు ఏగూరి జగన్, రఫీ అహ్మద్, కరిముల్లా, మాల్యాద్రి, డేవిడ్, చెంచురామయ్య, జిలానీ, మనోహర్, మురళి, షేక్ కాలమ్మ, టిడిపి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తల్లిపాల విశిష్టత పట్ల అవగాహన ఆవశ్యకం-ప్రయోజనకరం

**ఆత్మకూరు, ఆగస్ట్ 3, ప్రభాతవార్త :** తల్లిపాల విశిష్టతను-ప్రయోజనాల గురించి మహిళలంతా తెలుసు కోవడం అత్యంత ఉపయోగం ,ఆవశ్యకమని ఆత్మకూరు ఐసిడిఎస్ సిడిపిఒ పి.సునీలత పేర్కొన్నారు. శని వారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసిడిఎస్ పిడి బి.హేనాసుజన్ ఆదేశాల మేరకు సూపర్వైజర్లు ఎన్.కేశవనారాయణమ్మ, ఎన్.నాగేశ్వరమ్మల ఆధ్వర్యంలో నెల్లూరుపాళెం, నువ్వురుపాడు, కరటంపాడు సచివాలయాల పరిధిలోని పాతజంగాలపల్లి , నెల్లూరుపాళెం ఎస్టీకాలనీ, కరటంపాడు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల అవగాహనా ర్యాలీలు , సదస్సులు, శ్రీమంతం కార్యక్రమాల్లో సునీలత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో తల్లిపాల గురించి అవగాహనకల్పిస్తూ ర్యాలీలు నిర్వహించారు. గర్భిణీలను ప్రోత్సహించేలా వారే స్వయంగా శ్రీమంతం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సదస్సుల్లో సిడిపిఒ సునీలత ప్రసంగిస్తూ పుట్టిన బిడ్డలకు గంటలోపు తల్లి ముర్రుపాలు ఇస్తే ఎంతో ప్రయోజనకరమని, ముర్రుపాలల్లో రోగ నిరోధకశక్తి అధికంగా ఉంటుందన్నారు. పుట్టిన బిడ్డలకు ఆరునెలల వరకు తల్లిపాలను ఇవ్వాలని అనంతరం అదనపు ఆహారాన్ని ఇవ్వాలని పేర్కొన్నారు. తల్లిపాలు బిడ్డలకు అమృతమని , ముర్రుపాల మురిపాలని , బిడ్డకు తొలి టీకా అని సునీలత పేర్కొన్నారు. సూపర్‌వైజర్లు నారాయణమ్మ, నాగే శ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ.మస్తానమ్మ, ఎం.వేణుకుమారి, కె.ఎల్.నారాయణమ్మ, పి.పరమేశ్వరి, లక్ష్మీనరసమ్మ, విజయలక్ష్మి, పద్మ, కవిత, వెంకటసుబ్బమ్మ, అంకమ్మ, అమృత , కామేశ్వరి , సామ్రాజ్యం, సురేఖ, నిక్సి, బీబీజాన్, అనసూయ, నిర్మలాకుమారి, విజేత, శారద, వైద్యఆరోగ్య సిబ్బంది ఎం.సుభాషిణి, పి.జిలానీబాషా, పద్మ, ఎం.ఎస్.కె.గౌసియా, పలువురు గర్భిణీలు, బాలింతలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు అండగా హ్యాపీ సేవా సంస్థ

కావలి రూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త కావలి ఉదయగిరి బ్రిడ్జి వద్ద గత కొంతకాలంగా ఎన్.శ్రీను అనే నిరుపేద గిరిజన యువకుడు టిబి వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న హ్యాపీ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషా సంస్థ సభ్యులతో శనివారం అతనికి కావాల్సిన సరుకులతో పాటు కొంత నగదును అందజేశారు. శ్రీనుకు ఏ అవసరం వచ్చినా హ్యాపీ సేవా సంస్థ అన్ని విధాలుగా అండగా వుంటుందని సయ్యద్ ఘనీబాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సలహాదారు చేవూరు ప్రభయ్య, సయ్యద్ నౌషాద్ ఆలీ, ప్రసాద్, బాలకృష్ణ, శ్రీను కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## సంతృప్తితో తిథి భోజనం

**వింజమూరు, ఆగస్ట్ 3, ప్రభాతవార్త :** వింజమూరు మండలం చాకలికొండ గ్రామంలోని రాధాకృష్ణ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో శనివారం విద్యార్థులు సంతృప్తితో తిథి భోజనం చేశారు. ప్రధానోపాధ్యాయులు పోలుబోయిన రమేష్ తండ్రి మాలకొండయ్య జ్ఞాపకార్థం విద్యార్థులకు తిథి భోజనాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పలు రకాల స్వీట్లు , ఫలాలను భోజనంతోపాటు అందజేశారు. ఉపాధ్యాయులు సుభాషిణి, సురేష్, సీతామహాలక్ష్మి, షేక్ షమీలా బేగం, వ్యాయామ ఉపాధ్యాయుడు వెలుగోటి కృష్ణ, జూనియర్ అసిస్టెంట్లు సూరా రామిరెడ్డి, హరి , విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రణాళికాబద్ధంగా ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించాలి

**కోవూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆగస్టు 8వ తేది నిర్వహించనున్న ఎస్ఎంసీ ఎన్నికలను ఒక ప్రణాళికాబద్ధంగా నిర్వహించేలా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి రహీమ్ అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులతో ఈ ఎన్నికలకు సంబంధించి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ఈ ఎన్నికలకు సంబంధించి ఒక స్పష్టమైన ఆదేశాలు, ఏ విధంగా ఎన్నికలు నిర్వహించాలో సూచనలు కూడా జారీ చేసిందన్నారు. దాని ప్రకారమే ఎన్నికలు నిర్వహించేలా ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. దీనికి సంబంధించి తల్లిదండ్రుల్లో కూడా ఈ ఎన్నికల పట్ల అవగాహన కల్పించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీహరి, వెంకటేశ్వర్లు నాయుడు, రాధారాణిలు పలు సూచనలు చేశారు. మండలంలోని అన్ని పాఠశాలల ప్రధనోపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పథకం పనులు సద్వినియోగం చేసుకోవాలి

**కోవూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న సన్న, చిన్నకారు రైతులు తమ పొలాల గట్ల మీద మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద అందిస్తున్న పండ్ల తోటల పెంపకం పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని డ్వామా ఏపీడీ మృదుల అన్నారు. ఈ మేరకు శనివారం ఆమె ఈ పథకంతో పాటు పలు విషయాలపై ఎంపీడీవో రామాంజనేయులుతో ప్రత్యేకంగా చర్చించారు. ఆమె మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకంతో పాటు టెంకాయ , ఎర్రచందనం, తదితర వాటితో పాటు పూల మొక్కలైన గులాబి, మల్లి, తదితర వాటిపై కూడా రైతులు తగు చొరవ తీసుకోవాలన్నారు. వీటికి అయ్యే ఖర్చు మొత్తం ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం అందజేస్తుందని, ఇటువంటి మంచి అవకాశాన్ని వారు ఉపయోగించుకోవాలన్నారు. అదేవిధంగా కోవూరు మండలంలో గృహ నిర్మాణ శాఖ ద్వారా గతంలో 2473 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వాటికి సంబంధించి 1215 గృహాలకు ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా నిధులు కూడా అందజేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఇంకా ఈ నిధులు వారి వారి ఖాతాల్లో పడని లబ్దిదారులు తమ సమగ్ర వివరాలతో ఉపాధి హామీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అదేవిధంగా ఈ పథకం కింద కూలీ పనులు చేసేందుకు ఎవరైనా ముందుకు వస్తే అటువంటి వారు జాబ్‌కార్డు, తమ పేరు నమోదుకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఏపీవో సుబ్బారావు, తదితరులు ఉన్నారు.



## ఆత్మ రక్షణ కొరకై బాలికలు ఈ క్రీడపై దృష్టి పెట్టాలి

**కోవూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త :** ప్రభుత్వం ఇటీవల స్కూల్ గేమ్ ఫెడరేషన్‌లో పెన్‌కాక్ సిలాట్ గేమ్‌ను ప్రవేశపెట్టడం జరిగిందని, ఈ క్రీడ బాలికల ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని ఝాన్సీరాణి తెలిపారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శనివారం ఈ క్రీడపై సంబంధిత ఆట కోచ్‌లు, క్రీడాకారులు బాలికలకు ఈ క్రీడ పట్ల అవగాహన కల్పించేలా డెమో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి క్రీడల పట్ల బాలికలు ప్రత్యేక దృష్టి సారించి అవగాహన చేసుకుంటే ఇది వారికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇటువంటి క్రీడలు దేహదారుడ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని కూడా కలిగిస్తాయని కోచ్ సునీల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ క్రీడకు సంబంధించి కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు జాన్ బిన్నీ, సాయి కిరణ్, షోయబ్, షాహుల్, తరుణ్, మురుగల్, నారాయణ, సాత్విక్, ప్రీతి, హారిక, తదితరులు ఉన్నారు. అనంతరం ఈ డెమో బృందం స్థానిక జేబీఆర్ ఉన్నత పాఠశాలలోనూ, వైకేఆర్‌అండ్‌కే డిగ్రీ కళాశాలలో కూడా ఈ క్రీడల పట్ల అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టారు.



## ముర్రుపాలల్లో బలవర్ధకమైన పోషకాలు ఉన్నాయి

**లేగుంటపాడు(కోవూరు,) ఆగస్టు3 ప్రభాతవార్త :** బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు తాగిస్తే చిన్నారుల్లో రోగ నిర్ధారణ శక్తి మరింత మెరుగవు తుందని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిరంజన్ తెలిపారు. కోవూరు మండలం లేగుంటపాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆశాలకు, ఆరోగ్య సిబ్బందికి తల్లిపాల విశిష్టతను సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా లేగుంటపాడు గ్రామ సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అందిస్తున్న బలవర్థకమైన పౌష్టికాహారాన్ని గర్భవతులు, బాలింతలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలా మాట్లాడుతూ తల్లిపాలల్లో మెరుగైన పోషకాలు ఉన్నాయని, తప్పనిసరిగా ఆ పాలను పుట్టిన వెంటనే బిడ్డకు అందించాలన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బలవర్ధకమైన ఆహారాలను తపస్పనిసరిగా గర్భవతులు, బాలింతలు తీసుకోవాలని ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్, పీహెచ్‌ఎన్ కృష్ణమ్మ, స్రవంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.



## ఇసుక అక్రమ రవాణాపై ఎస్సై మెరుపుదాడులు

**కోవూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని పలు ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు ఎడ్ల బండ్లతో పెన్నానది పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక తీసుకుని వచ్చి మోడేగుంట గ్రామ పరిసరాల్లో ఇసుకను డంప్ చేసి రాత్రి సమయాల్లో ఆ ఇసుకను ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ మేరకు శనివారం తెల్లవారుజామున కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ ఆ ప్రాంతంలో దాడులు నిర్వహించి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎడ్ల బండ్లపై, ట్రాక్టర్‌పై కూడా కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు మండలంలోని ఏ ప్రాంతంలోనైనా నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు. అదేవిధంగా ఎవరైనా ఎడ్ల బండ్లతో ఇసుకను వారి వారి సొంతానికి కాకుండా ఈ విధంగా అక్రమ రవాణాకు సహకరిస్తే అటువంటి వారిపై కూడా కేసు నమోదు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.



## తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

**వరికుంటపాడు, ఆగస్ట్ 3, ప్రభాత వార్త:** తల్లిపాలే బిడ్డకు ఎంతో శ్రేయస్కర మని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కళావతి అన్నారు. శనివారం మండలంలోని గొల్లపల్లి మైన్ అంగన్‌వాడి కేంద్రంనందు తల్లిపాల వారోత్సవాలలో భాగంగ గర్భవతులకు, బాలింతలకు, తల్లులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతు పుట్టిన శిషువుకు అరగంటలోనే తల్లిపాలు ఇవ్వడంవల్ల ఆరోగ్యవంతంగ వుంటారన్నారు. తల్లి పాలు బిడ్డకు ఇవ్వ డంవలన విటమిన్స్, మనరల్స్, ప్రోటీన్స్ సంవృద్దిగ లభిస్తాయన్నారు. బిడ్డకు వ్యాధినిరోదకశక్తి కూడా పెరుగుతుందన్నారు. శిషువుకు తల్లిపాలు ఇచ్చేసమయంలో వ్యక్తిగత పరిశుభ్రతను తప్పక పాటించాలని సూసించారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రాదమికపాఠశాల ఉపాద్యాయుడు మురళీకృష్ణ, అంగన్‌వాడి కార్యకర్తలు రమాదేవి, రత్నమ్మ, అనూష, ఆశాకార్యకర్త రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



## వలేటివారిపాలెం తహసిల్దార్‌గా అబ్దుల్‌అమీమ్

వలేటివారిపాలెం ఆగస్టు 3, ప్రభాతవార్త ఎన్నికల సందర్భంగా మండలాలలో విధుల నిర్వహిస్తున్న తహసిల్దార్‌లను బదిలీ చేసి వారి స్దానంలో కొత్త తహసిల్దార్‌లను నియమించారు. ఈ మేరకు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఐఏఎస్ శనివారం ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ నేపద్యంలో వలేటివారిపాలెంకు షేక్ అబ్దుల్ అమీమ్, కందుకూరుకు సయ్యద్ ఇక్బాల్, లింగసముద్రంకు ఇ.రమాదేవి, ఉలవపాడుకు వి.లావణ్య, కొండాపురంకు సుందరమ్మలను తహసిల్దార్‌లుగానూ, కందుకూరు సబ్‌కలెక్టర్ ఆఫీస్ ఏవోగా టి.శ్రీనివాసులును నియమించారు. త్వరలో వీరంతా నిర్దేశిత మండలాల్లో విధుల్లో చేరనున్నారు.

## ఆయుర్వేద శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కోవూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త : ప్రాచీణ ఆయుర్వేదంలో ఎన్నో మొండి రోగాలను సైతం నయం చేసే మందులు ఉన్నాయని, వాటిని ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆయుర్వేద వైద్యులు డాక్టర్ గంగాధర్‌తెలిపారు. కోవూరు మండలం పాటూరు పంచాయతీ పరిధిలోని పల్లిపాలెం గ్రామంలో శనివారం ఉచిత ఆయుర్వేద శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరులో ఉన్న తమ ఆయుర్వేద వైద్యశాలలో అనేక మొండి రోగాలను సైతం నయం చేసే మందులు ఉన్నాయని, ఈ సేవలను ప్రజలు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం ఆ ప్రాంతంలో ఉన్న వృద్ధులకు ప్రస్తుత సీజన్‌లో వచ్చే రోగాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రామన్నపాలెం ఆయుర్వేద వైద్యులు డాక్టర్ హేమంత్, కాంపౌండర్లు శ్రీహరి, మల్లయ్య, తదితరులు ఉన్నారు.



## పౌష్టికాహారం పట్ల మరింత అవగాహన అవసరం

కోవూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త : పుట్టిన ప్రతి బిడ్డకు మొదటి ఆహారం తల్లిపాలు అని, వీటిపై గర్భవతులు, బాలింతలు పూర్తి స్థాయిలో అవగాహన చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీప్రసన్న తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు అంగన్‌వాడీ కేంద్రంలోగర్భవతులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలలో బలవర్థకమైన పోషకాలు ఉఆన్నయని, వీటి ద్వారా బిడ్డకు రోగనిరోధక శక్తి ఘననీయంగా పెరుగుతుందన్నారు. ముఖ్యంగా గర్భవతులు బలవర్థకమైన పోషకాహారంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, సుభాషిణి, సుందరమ్మ, కామేశ్వరి, నారాయణమ్మ, మమత, ఆయాలు ఉన్నారు.



## తల్లిపాలతోనే బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం

రాపూరు, ఆగష్టు 3 ప్రభాతవార్త తల్లిపాలతోనే బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని రాపూరు బిట్ యం.ఎల్.హెచ్.పి పి.సురేఖ తెలిపారు. రాపూరు సెక్టార్ పరిధిలోని రాపూరులోని బిసి కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పడమర వీధి, మసీదుపేట అంగన్‌వాడీ కేంద్రాలకు సంబందించిన గర్భవతులు, బాలింతలతో తల్లిపాల వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భవ తులకు, బాలింతకు ఇచ్చే ఆహారపదర్థాలనుప్రదర్శించారు. అనంతరం తల్లిపాల అవశ్యకతను సురేఖ గర్భవతులకు బాలింతలకు వివరించారు. సూపర్‌వైజర్‌ధనమ్మ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ తల్లిపాల వారోత్సవాలలో ఆరోగ్య కార్యకర్త హరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.కె.మెహతా జ్, పి.ప్రమీలా, బి. రమా, పలువురు గర్భవతులు, బాలింతలు వున్నారు.



## రాపూరు తహశిల్దార్‌గా యం.శ్యామసుందర్ రాజు

రాపూరు, ఆగష్టు 23 పభాతవార్త రాపూరు మండల నూతన తహశిల్దార్‌గా యం.శ్యాంసుందర్ రాజును నియమిస్తూ జిల్లా కలెక్టర్ శనివారంఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలల బాగంగా ప్రకాశం, గుంటూరు జిల్లాల నుండి వచ్చిన తహశిల్దార్‌లు వారి సోంతజిల్లాలకు వెల్లిపోవడంతో అక్కడికి వెల్లి వున్న ఈ జిల్లాకు చెందిన తహశిల్దార్‌లు జిల్లాకు రావడంతో వారిని వివిధమండలాలకు నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయినాయి. ఈ క్రమంలో రాపూరు తహశిల్దార్‌గా శ్యామసుందర్ రాజు నియమితులైనారు. రాపూరుకు వస్తున్న తహశిల్దార్ యం.శ్యామసుందర్ రాజు గతంలో ఈ మండలంలో రెవెన్యూఇనస్పెక్టర్‌గా, డిప్యూటీ తహశిల్దార్‌గా, తహశిల్ధార్‌గా విధులు నిర్వహించి మంచి అధికారిగా పేరు తెచ్చుకోని వున్నారు. ఈయన తిరిగి ఈ మండలానికి రావడంతో మండలంలోని అన్ని సమస్యలపై అవగాహన వున్న ఆయన వాటి పరిష్కారానికి కృషి చేస్తారని మండల ప్రజలు అశిస్తున్నారు.



## నెల్లేపల్లిలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

రాపూరు, ఆగష్టు 3 ప్రభాతవార్త మండలంలోని నెల్లేపల్లిలో శనివారం తల్లిపాల వారోత్స వాలను ఘనంగా నిర్వహించారు. వెపినాపి సెక్టార్‌పరిధిలోని నెల్లేపల్లి సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలను సెక్టార్ సూపర్‌వైజర్ సౌజన్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సచివాలయం యం.ఎల్.హెచ్.పి సారాగర్భవతులకు, బాలింతలకు తల్లిపాల అవశ్యకతను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే పౌష్టికాహారం తీసుకోనిబిడ్డలకు పాలు ఇవ్వాలని కోరారు. వెపినాపి పిహెచ్‌సి పిహెచ్‌ఎన్ హసీనా, ఆరోగ్య కార్యకర్త విజయ, యంఎస్‌కె అనితా, సచివాలయం పరిధిలో వున్న అంగన్‌వాడీ కేంద్రాల అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలు పాల్గోన్నారు.



## నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకుడు కూకాటి నర్సయ్య మరణం

రాపూరు, ఆగష్టు 3 ప్రభాతవార్త రాపూరు ఆర్టీసి డిపోలో నేషనల్ మజ్దూర్ నాయకుడిగా వున్న డిపో క్లర్క్ కూకాటి నర్సయ్య శనివారంమృతి చెందాడు. యూనియన్ నాయకునిగా, మంచి కండక్టర్‌గా వున్న నర్సయ్య ప్రస్తుతం డిపో క్లర్క్‌గా వున్నాడు. 22 రోజుల క్రింతం అనారోగ్యానికి గురైన ఆయన నెల్లూరులోని బోల్లినేని ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించు కోనిచి కిత్సపోందుతున్న ఆయన పంగిలి గ్రామంలో తన నివాసంలో మృతి చెందాడు. నర్సయ్య మృతి విషయం తెలుసుకోన్నపలువురు ఆర్టీసి సిబ్బంది, పలు యూనియన్‌లకు చెందిన నాయకులు, పలువురు రాజకీయ నేతలు, పెద్ద ఎత్తున పంగిలి గ్రామానికి వెల్లి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళుర్పించారు.



## తల్లిపాలతో చిన్నారులకు మంచి ఆరోగ్యం

ఏపూరు(రాపూరు), ఆగష్టు 3 ప్రభాతవార్త తల్లిపాలతో చిన్నారులకు మంచి ఆరోగ్యం లభిస్తుందని గోనుపల్లి సెక్టార్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జె.రాజ్యలక్ష్మీ తెలిపారు. తల్లిపాల వారోత్సవాలలో బాగంగా శనివారం సెక్టార్ పరిధిలోని ఏపూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలలో ఆమె పాల్గోని తల్లిపాల అవశ్యకతను వివరించారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలనుతప్పని సరిగా తాపించాలన్నారు. గర్భిణీలు మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా బిడ్డకు అవసరమైన పాలనుఇవ్వవచ్చని తెలిపారు. ఈ వారోత్సవాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీ, సులోచన, జాస్మిత, ప్రసన్న, ఆరోగ్యకార్యకర్త సెల్వీ, అశాలు, గర్భ వతులు, బాలింతలు వున్నారు.



## దుండిగం మెయిన్ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు

దగదర్తి, ఆగస్టు 3 ప్రభాతవార్త : దగదర్తి మండలం దుండిగం అంగన్వాడీ మెయిన్ సెంటర్‌లో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కావలి ఐసిడిఎస్ సిడిపివో కె.సౌజన్య మాట్లాడారు. తల్లి పాల విశిష్టతపై అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన గంట లోపే తల్లిపాలు తాగించాలన్నారు. తల్లిపాలు బిడ్డకు వ్యాధినిరోధక శక్తిని ఇస్తుందన్నారు. తల్లి పాలు బిడ్డకు అమృతమన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జె.వాణి, మెడికల్ ఆఫీసర్ జె.ఏడుకొండలు, అంగన్వాడీ టీచర్లు డి.వసుంధరమ్మ, పి.రాజేశ్వరి, గర్భవతులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.



## తల్లిపాలు బిడ్డలకి అమృతం వంటివి



బుచ్చి ఆగస్టు 3 ప్రభాతవార్త తల్లిపాలు అమృతం వంటివని ,ప్రతి తల్లి బిడ్డకు పాలు ఇవ్వాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వి.శకుంతల సూచించారు .బుచ్చిరెడ్డిపాళెం లోని 18 వవార్డులోని కోనేటిమిట్ట అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం లో పాల్గొన్న సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్ పరిశీలించారు.ఈ సందర్భంగా తల్లులకు పలు సూచనలు చేశారు.ప్రతి తల్లి బిడ్డకు ముర్రుపాలు తాగించాలని అన్నారు.ముర్రుపాలలో వ్యాధి నిరోదక శక్తి వుంటుందని, తల్లిపాలు త్రాగి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఆమె వివరించారు. అలాగే తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు.ప్రతి తల్లి పౌష్టికాహారం పూర్తి స్థాయిలో తీసుకొని బిడ్డలకు పాలు ఇవ్వాలని ఆమె సూచించారు.ఈకార్యక్రమంలో హెచ్‌వి కె.పద్మ గర్భవతులకు కిల్కారీ గురించి వివరించారు. ఎఎన్ఎం కె.రమాదేవి టీకాల గురించి తెలియజేశారు. అంగన్‌వాడీ టీచర్లు సుప్రజ, సిందూర,వాసవి,సుబ్బమ్మ, సుమలత, ఝాన్సీ, అంగన్‌వాడీ వర్కర్ మరియు ఆశావర్కర్లు,గర్భవతులు,బాలింతలు పాల్గొన్నారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**బుచ్చి ఆగస్టు 3 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు సెక్టార్ పరిధిలోని దామరమడుగు మెయిన్ సెంటర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు సిడిపి జ్యోతి ఆదేశానుసారం సూపర్‌వైజర్ ఉమా ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఉమా మాట్లాడుతు పుట్టిన ప్రతి బిడ్డ మొదటి ఆహారం అమ్మపాలు,మొదటి టీకా ముర్రుపాలు అని ఆమె తెలిపారు. ముర్రుపాలు బిడ్డ పుట్టిన గంటలోపు పట్టించాలని అన్నారు. తల్లిపాలు బిడ్డకు గ్యాపు లేకుండా (పుట్టిన ఆరు నెలలు) వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని అన్నారు. 7 నెలల నుండి 2 సంవత్సరాల వరకు తల్లిపాలు కొనసాగిస్తునే అదనపు ఆహారం ఇవ్వాలని అన్నారు. తల్లిపాలు ఇవ్వడం వలన తల్లిబిడ్డకు ప్రేమానురాగాలు పెరుగుతాయని చెప్పారు. తల్లిపాలు ఇచ్చినందు వల్ల ఆమెకు రోమ్ము క్యాన్సర్ వంటివి రాకుండా ఉంటాయని అన్నారు. తల్లిపాలు అమృతం వంటివి అని చెప్పారు. బిడ్డకి పాలు ఇచ్చే సమయంలో ప్రతి తల్లి శుభ్రత పాటించాలని చెప్పారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శేషమ్మ, ఆశావర్కర్ పుష్పా,ఎలిమింట్రి స్కూల్ ఉపాధ్యాయురాలు ప్రసన్న,అంగన్‌వాడీ టీచర్లు వర్కర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగులు అందజేసిన ఎమ్మెల్యే



కందుకూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాఠ్యపుస్తకాలు, బ్యాగులు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ముందుగా విద్యార్థినులు కోలాటంతో ఎమ్మెల్యేకి స్వాగతం పలకగా, ప్రిన్సిపాల్ ఒరుగంటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో కాకుండా, ఇష్టపడి చదివి తల్లిదండ్రులకు కాలేజీకి గౌరవం పెంచేలా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే విద్యార్థులకు సూచించారు. 2014-2019 మధ్య టీడీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేస్తే, జగన్ ప్రభుత్వంలో పూర్తిగా నిలిపివేశారని అన్నారు. అలాగే ఇంటర్మీడియట్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం పథకం కూడా ఆపివేశారని అన్నారు. పాదయాత్రతో ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దాదాపు 2 లక్షల మంది విద్యార్థులకు మంత్రి లోకేష్ మళ్లీ వస్తువులు అందిస్తున్నారని నాగేశ్వరరావు చెప్పారు. ఇక నుంచి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు తాము సొంతంగా నగదు బహుమతులను అందజేస్తానని విద్యార్థుల హర్షధ్వానాల మధ్య ఎమ్మెల్యే ప్రకటించారు. కమ్యూనికేషన్, స్కిల్స్, టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా కాలేజీకి 4 ల్యాబ్‌లు అవసరం ఉందని, మెయిన్ రోడ్డు నుంచి కాలేజీ వరకు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని, ఇంకా పలు సమస్యలపై ప్రిన్సిపాల్ ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేయగా సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు 15 ఫ్యాన్లు, పట్టణ ఉపాధ్యక్షులు వడ్డెళ్ళ రవిచంద్ర 5 ఫ్యాన్లు, ఒగూరు నాయకుడు అల్లం వెంకటేశ్వర్లు కంప్యూటర్‌ను కాలేజీకి ఉచితంగా అందజేస్తామని ప్రకటించగా వారిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఒరుగంటి వెంకటేశ్వరరావు, పీడీ సుబ్బారావు, అధ్యాపకులు పట్టణ టీడీపీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు చిలకపాటి మధు, బెజవాడ ప్రసాద్, వడ్డేళ్ళ రవిచంద్ర, వచ్చు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మనుబోలులో ఆగిన గృహనిర్మాణ శాఖ మంత్రి



**మనుబోలు, ఆగష్టు 3, ప్రభాతవార్త** : రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి గొలుసు పార్థసారది కాగితాలపూరు రోడ్డులో శనివారం మధ్యాహ్నం ఆగారు. తిరుపతికి వెళ్తూ కాగితాల పూరులోని పద్మావతి హోటల్‌లో ఆయనకు భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ ప్రయత్నంలో జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీలు, డీఈలు, ఏఈలు, వర్క్ఇన్‌స్పెక్టర్‌లు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పార్ధసారది పక్కా గృహాల నిర్మాణం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీడీ దయాకర్ జగనన్న కాలనీలో సమస్యలు గురించి ఏకరువు పెట్టారు. ఆయన వెంట ఆర్డీఓ డీఎల్‌పీఓ, మనుబోలు హౌసింగ్ ఏఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా ద్వారా సమాజంలో మంచి గుర్తింపు




**వెంకటాచలం ఆగస్టు 3 ప్రభాతవార్త** : విద్యా ద్వారా సమాజంలో గుర్తింపు,ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చున్ని తద్వారా తల్లి దండ్రులకు గురువులకు పాఠశాలకు మంచి పేరు తీసుకోని రావచ్చున్ని సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విద్యార్దులకు పిలుపు నిచ్చారు. మండల పరిదిలోని వెంకటాచలం లోని జూనియర్ కళశాలలో శనివారం ఇంటర్ విద్యార్దులకు పుస్తకాలను పింఫిణి చేశారు.అనంతరం సోమిరెడ్డి మాట్లడుతూ విద్యార్దులు విద్య తోపాటు క్రమశిక్షణ,క్రీడలపై పట్లు సాదించాలన్నారు.మారుతున్న పరిస్దితులకు అనుగుణంగా టెక్నాలజీని అనుగుణంగా విద్యార్దులు తయారు కావలన్నారు.సమాజ సేవాపై అవగాహన కల్గి ఉండాలన్నారు.ఎంచుకున్న లక్ష్యానికి అనుగుణంగా కష్టపడి విద్యను అభ్యశిస్తే తప్పకుండా గమ్యను చేరుకోగలమన్నారు.మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సి,హెచ్,సీ,లకు వాటర్ ప్లాంట్



**వెంకటాచలం ఆగస్టు 3,ప్రభాతవార్త** : సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం ,పొదలకూరులో, ఉన్న సామజీక ఆరోగ్య కేంద్రాలకు వాటర్ ప్లాంట్, జనరేటర్,కంప్యూటర్లు,వాషింగ్ మిషన్ ఏర్పాటు చేస్తామని సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు .వెంకటాచలం లోని సామజీక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం సోమిరెడ్డి పరిశీలించారు.సర్వేపల్లి నియోజకవర్గంలో ఉన్న అన్ని సీ హెచ్‌సీలకు,పి,హెచ్‌సీలకు పూర్తి స్దాయిలో వసతులు కల్పిస్తామన్నారు.ప్రభుత్వ నిధులతోపాటు సిఎస్ఆర్ ఆర్ పండ్‌ను వినియోగించి కలెక్టర్ అనుమతితో పూర్తి స్దాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు.పేదలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కార్పోరేట్ హస్పటిల్‌కు దీటుగా ప్రభుత్వ హస్పటిల్‌లో తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు.జాతీయ రహదారిపై ఉన్న వెంకటాచలం సామజీక ఆరోగ్య కేంద్రానికి వైద్యలు స్టాప్ పూర్తి స్దాయిలో అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు.రోగులకు స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా బోజనం అందిస్తున్న దీపా వెంకట్‌ను అబీనందించారు.వెంకటాచలంలో త్వరలో పోస్టుమార్టం గదులకు అవసరమైన అన్ని ఏర్పాటు చేస్తామన్నారు.ఆరోగ్య కేంద్రాలో ఉన్న సమస్యలు గుర్తించి నివేదికలు సిద్దం చేయాలని అదికారులకు సూచించామన్నారు.ప్రతి గదిని పరిశీలించి హస్పటిల్‌కు కావలసిన అవసరాలపై ఆరా తీశారు. ఈకార్యక్రములో మండల టిడిపి అద్యక్షులు గుమ్మడి రాజా యాదవ్, భాజపా నాయకులు కుంచె శ్రీనివాసులు యాదవ్, రమేష్,మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీగోపాలకృష్ణయ్యస్కూల్‌లో వన మహోత్సవ కార్యక్రమం



**బుచ్చి ఆగష్టు 3 ప్రభాతావార్త** : బుచ్చిరెడ్డిపాళెం గోపాల కృష్ణయ్య స్కూల్‌లో వనమహోత్సవ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఇఒ రామారావు,నగర కమీషర్ రమణబాబు, ఎంఇఒ 2 రత్నం ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ తిరివీధి సుబ్రమణ్యం,ట్రెజరర్ సరాబు నాగయ్య హాజరు అయ్యారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ నేత నూతల శ్రీదర్,ఉపాధ్యాయులు సురేఖ,ఉపాధ్యాయులు ఆహ్వానించారు. అందరికి అమ్మ పేరుతో నాటే మొక్కను అందజేశారు. 100 మంది విద్యార్థులకు మొక్కలు అందజేశారు. జనవరి 10 వ తేది వరకు మొక్కలను కాపాడిన వారికి 5 వందలు రూపాయాలు బహుమతిగా ఇస్తామని తెలిపారు. వారది పౌండేషన్ నెల్లూరు వారి సహకారంతో ఈ మొక్కలను విద్యార్థులకు అందజేసినట్లు తెలిపారు. పౌండేషన్ చైర్మన్ రంగనాద్‌కి ధన్యవాదాలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోడి పిలుపు మేరకు మాకాపేడ్ తల్లిపేరుతో మొక్కనాటి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వింజమూరును క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచేందుకు చర్యలు



**వింజమూరు, ఆగస్ట్ 3, ప్రభాతవార్త** : ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రధాన పట్టణమైన వింజమూరును క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉందేందుకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశించారు. వింజమూరు బంగ్లాసెంటర్‌లోని రహదారుల వెంబడి స్థానిక నేతలతో కలసి పలు ప్రాంతాలను పరిశీలించారు. రహదారుల వెంబడి పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. అనంతరం కాలి నడకనే సచివాలయం-1 చేరుకొని పంచాయతీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకరవర్గంలోనే అతి పెద్ద మండలమైన వింజమూరును అన్ని విధాల అభివృద్ధిపథంలో ఉంచేందుకు అధికారులు సహకరించాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చూపరాదన్నారు. మేజర్ పంచాయతీ పాలకవర్గం మేధావులు, పెద్దలతో కలసి గ్రామసభ నిర్వహించి ప్రజల అభ్యర్థన మేరకు అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. పంచాయతీ అభివృద్ధికి తాను సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ప్రభుత్వం రెండునెలలవుతున్నా ఇప్పటికీ కొంతమంది అధికారులు వైసిపి అధికారంలో ఉందన్న భ్రమలో పనిచేస్తున్నట్టున్నారన్నారు. ప్రతి సచివాలయంలో ముఖ్యమంత్రి ,ఉపముఖ్యమంత్రి ఫోటోలు పెట్టాలని సూచించినా అధికారులు ఆ దిశగా పనిచేయడం లేదన్నారు. వెంటనే సచివాలయాల్లో ఫోటోలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 7వేల ఇళ్ళు నిర్మాణాలు చేపట్టారని వాటిలో కొన్ని నిర్మాణాలు కాలేదని, కొన్ని నిర్మాణాలు అవతవకలుగా ఉన్నాయని తన దృష్టికి వచ్చాయని విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. మండల కన్వీనర్ గొంగటి రఘునాధరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, యువనాయకులు గణపం సుదర్శన్‌రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావ్ , నాయకులు వనిపెంట సుబ్బారెడ్డి, కోదూరు నాగిరెడ్డి, కొండపల్లి వెంకటేశ్వర్లు, దాట్ల రమణారెడ్డి, బిజెపి ఇన్‌చార్జ్ కదిరి వెంకటరంగారావ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాపులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మాదినేని ఆటో సౌకర్యం



**వింజమూరు, ఆగస్ట్ 3, ప్రభాతవార్త** : మండలంలోని ఊటుకూరు ఉన్నత పాఠశాలకు పరిసర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఆటో సౌకర్యం ఏర్పాటు చేసేందుకు ఊటుకూరు టిడిపి నాయకులు మాదినేని నాగేశ్వరరావ్ తన సొంత నిధులు వెచ్చించి ఆటోను ఏర్పాటు చేశారు. ఊటుకూరు ఉన్నత పాఠశాల పరిధిలోని తక్కెళ్ళపాడు, ఇందిరానగర్, జూగుంటపాళెం గ్రామాల నుండి విద్యార్థులు నిత్యం మోయ లేని భారంతో పుస్తకాలు మోసుకుంటూ సుమారు 4కిలోమీటర్ల మేర నడుచుకొని వచ్చి చదువుకోవాల్సిన పరిస్థితి ఉండడంతో విద్యార్థుల పరిస్థితిని గమనించిన మాదినేని నాగేశ్వరరావ్ 10వేల రూపాయలను వెచ్చించి ఒక ఆటోను ఏర్పాటు చేసి ప్రతిరోజు విద్యార్థులను జాగ్రత్తగా పాఠశాలకు చేర్చాలని తెలిపారు. ఇందుకోసం ఆటో ఖర్చుల నిమిత్తం 10వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రంతుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిబికెఆర్ ఎస్టీకాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



**వింజమూరు, ఆగస్ట్ 3, ప్రభాతవార్త** : వింజమూరు పంచాయతీ పరిధిలోని జిబికెఆర్ ఎస్టీకాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శనివారం కాలనీ వాసుల అభ్యర్థన మేరకు కాలనీలో ఎమ్మెల్యే పర్యటించి రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సమస్యలను పరిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సరైన మౌలిక వసతులు లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని చుట్టూ ఏపుగా పెరిగిన చెట్లు పాములు తిరుగుతుండడంతో చీకటిలో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామంలోని సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈకార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మెన్ జూపల్లి రాజారావ్, నాయకులు వనిపెంట వెంకటసుబ్బారెడ్డి, ఎంపిటిసి సభ్యురాలు యాకశిరి భవాని, అల్లూరు వెంకటేశ్వర్లు, అల్లూరు వాణి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## చెత్తను తెచ్చిన చిన్నారిని అబినందించిన కమీషనర్



**బుచ్చి ఆగష్టు 3 ప్రభాతవార్త** : బుచ్చిరెడ్డిపాళెం నగర పాలక పంచాయితీలో ఉదయం మున్సిపాల్టీ ట్రాక్టర్‌కి చెత్తను తీసుకొని వచ్చిన ఓ చిన్నారని కమీషనర్ రమణ బాబు అభినందించారు. చిన్న తనం నుండి వారిలో ఇంత మంచి అలవాట్లు రావడం అభినందనీయమని పాప తల్లిదండ్రుల ఆయన అభినందించారు.ప్రతి ఒక్కరు చెత్తను మున్సిపాల్టీ వాహనాలకు అందించాలని కోరారు.

## డాక్టర్ దారాను సత్కరించిన కావలి పట్టణ నాయకులు



**కావలి రూరల్, ఆగష్టు 3 ప్రభా తవార్త** : కావలి వెంగళరావునగర్‌కు చెందిన దళిత నాయకులు, సామాజిక కార్యకర్త, డాక్టర్ బి.ఆర్.అంబేద్కరిస్ట్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు దారా శ్రీనివాసులకు ఆయన చేసిన సామాజిక సేవలను గుర్తించి క్రీస్తులో సంపూర్ణ ఎవేంజికల్ మిషన్, ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ , విజయ్ హెల్పింగ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టరేట్ ప్రధానం చేశారు. ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సురేష్‌కుమార్ చేతుల మీదుగా దారా శ్రీనివాసులు గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఆయనను శనివారం కావలి పట్టణంలోని నాయకులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి స్వీట్లు తినిపించి అభినందించారు. ఈ సందర్భంగా దారా శ్రీనివాసులు మాట్లాడుతూ గౌరవ డాక్టరేట్ తనకు రావడం చాలా సంతోషంగా వుందన్నారు. ఈ డాక్టరేట్ నాపై మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. రానున్న రోజుల్లో సామాజిక, సేవా కార్యక్రమాలను మరింత విస్తృత పరిచి ఎంతో మందికి సేవలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ మైనార్టీ నాయకులు షేక్ రజాక్, దళిత నాయకులు కె.మస్తాన్, తదితర దళిత నాయకులు పాల్గొన్నారు.

## పూలదొరువు విద్యార్థికి డాక్టరేట్



**కావలి, ఆగస్టు 3 ప్రభాతవార్త కావలి** రూరల్ మండలం పూలదొరువుకు చెందిన తిరుమలశెట్టి అవినీష్‌బాబు భౌతికశాస్త్రంలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (తమిళనాడు)లో ప్రొఫెసర్ మాధురి నేతృత్వంలో ఆయన మెటీరియల్ సైన్స్‌లో ఎనర్జీ కన్వర్షన్ అండ్ ఎనర్జీ స్టోరేజ్ అనే అంశంపై పరిశోధనలు చేశారు. ఆయన పరిశోధనలు మెచ్చిన తమిళనాడులోని విట్ విశ్వవిద్యాలయం నిర్వహించిన 39వ స్నాతకోత్సవంలో అవినీష్‌బాబుకు డాక్టరేట్ పట్టా అందజేశారు. సామాన్య రైతు కుటుంబానికి చెందిన కావలి తీర ప్రాంతంలో మారుమూల గ్రామమైన పూలదొరువుకు చెందిన ఆయన ఈ డాక్టరేట్ పట్టాను అందుకోవడం కావలి బావుటాను ఎగురవేసినట్లయింది. ఆయన తండ్రి తిరుమలశెట్టి సుధాకర్‌బాబు, తల్లి రోహిణి దంపతుల కుమారుడైన అవినీష్‌బాబు భౌతిక శాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందడంపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. పూలదొరువులో ప్రాథమిక విద్య, హైస్కూలు, ఇంటర్ విద్య కావలిలో అభ్యసించారు. బిఎస్సీ డిగ్రీ కావలి మాగుంట డిగ్రీ కళాశాలలో పూర్తి చేశారు. కావలి విక్రమ సింహపురి యూనివర్సిటీ పిజి సెంటర్‌లో ఎంఎస్‌సి ఫిజిక్స్ చేశారు. ఇక్కడ ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి ప్రోత్సాహంతో పరిశోధనపై ఆసక్తిని పెంచుకున్నారు. అవినీష్‌బాబు థినఫిల్మ్‌పై పరిశోధన చేశారు. దేశంలోనే అత్యుత్తమ విశ్వవిద్యాలయమైన విట్‌లో పిహెచ్‌డి చేసేందుకు అర్హత సాధించారు. మారుమూల గ్రామం నుంచి మేధస్సుతో అత్యుత్తమ స్థాయికి ఎదిగిన అవినీష్‌బాబును తోటి పరిశోధకులతో పాటు వర్సిటీ ప్రొఫెసర్లు ప్రత్యేకంగా అభినందించారు.

## ఉత్తర కాత్వపై కాకర్లసురేష్



**కలిగిరి, ఆగష్టు 3,ప్రభాతవార్త;** రైతులకు ఉత్తకాల్వ అదికారులు కలిగించే ఇబబందులను తెలుసుకొనేందుకు ఉదయగిరి శాసన సబ్యులు కాకర్ల సురేష్ శనివారం రైతులతో కలసి ఉత్తకాల్వను పరిశీలించారు.కాల్వ వెంట అదికారులు రైతులకు చేసిన ఇబ్బందులను స్వయంగా చూసిన యంఎల్ఏ ఈవిషయం పై అదికారులదృష్టికి తీసుకు వెళ్లి రైతులకు న్యాయం చేస్తానన్నారు.కలిగిరి మండలం కమ్మవారిపాళెంక చెందిన రైతులుకు ఉత్తరకాల్వ వెంట పొలాలు ఉన్నాయి. అయితే కాలువ తొవ్వేసమయంలో అధికారులు రైతులకు అనుకూలంగా నడుచుకుంటామని నమ్మపలికి తమను అదికారులు మోసగించారని యంఎల్ఏదృష్టికితెచ్చారు. తమ గ్రామానికి చెంది పొలాలు కాలువ అవతలపక్క ఉన్నా గ్రామంనుండి పొలాలకు దరి లేదన్నారు. ఉన్న దారిలో అడ్డంగా కాలువతవ్విన అదికారులు పొలాలకునీరు వెళ్లేందుకు బ్రిడ్జీ నిర్మించలేదన్నారు.అదేవిదంగా ఊరి చెరువులకు వచ్చే వాగులు కాలువ అవతలవైపు ఉన్నాయని కాలువ నిర్మాణంతోవాగులు చెరువుకురాకుండా పోయాయన్నారు. దీనితో చెరువులకు నీరురాక చెరువులు ఎండిపోగా పొలాలు బీడుబారి పోతున్నాయన్నారు.తమ పొలాల మీదుగా కాలువ పోతున్నా ఉత్తరకాలువ నీరు తమ చెరువుకు రావడంలేదన్నారు. అంతేగాక కాలువ అడ్డంగా తవ్వినందువల్ల వాగుల నీరుకూడా చెరువుకు రావడంలేదన్నారు.ఇదేవిషయం అదికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా న్యాయం జరగలేదన్నారు. పైపెచ్చు తమపైనే ఆరోపణలు చేస్తున్నారని యంఎల్ఏ దృష్టికి తీసుకు వచ్చారు. దీనితో స్పందించిన కాకర్ల సురేష్ తాను వెంటనే ఈవిషయం అదికారుల దృష్టికి తీసుకెళ్లిరైతులకు న్యాయం చేస్తానన్నారు.

## ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో అసలేం జరుగుతుంది



ఉదయగిరి,ఆగష్టు 3,ప్రభాతవార్త : ఉదయగిరి మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం పట్ల పులవురు లేవనెత్తుతున్న ఇబ్బందులను బట్టి అధికారుల నిర్లక్ష్యాన్ని బట్టి చర్యలు చేపట్టాలని కొన్ని వర్గాల వారు పనికట్టుకొని అణగారిని వర్గాల వారి మీద తమ మార్కు చూపించుకుంటూ తమ తప్పులను కప్పిపుచ్చుకోవటానికి వేరొకరి మీద వేలెత్తి చూపుతున్నాయి.కొన్ని రోజుల నుండి వార్తల్లో నిలుస్తున్న ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం అందులో జరుగుతున్న అవకతవకలను ఎప్పటికప్పుడు బయటకు రానీయకుండా చిన్న తప్పులను పెద్దవిగా చూపిస్తూ ప్రజల దృష్టిని మరల్చటానికి చేస్తున్న కొందరి ప్రయత్నం కొంతమందిని కావాలనే టార్గెట్ చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు.ఈ సందర్భంగా ప్రభాతవార్తతో ప్రత్యేకంగా మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బకీరు జాషువా బెజవాడ గురవయ్య ప్రత్యేకంగా సామాజిక ఆరోగ్య కేంద్రం మీద కొన్ని ఆరోపణలు చేశారు.వారు మాట్లాడుతూ ఏ రంగంలో కూడా ఉద్యోగం చేసుకునే పరిస్థితి లేదని ప్రయత్నం లోపం లేకుండా తమ ఉద్యోగాన్ని నిర్వహించే కొందరు దళిత ఉద్యోగస్తులు మీద కొంతమంది పనిగట్టుకొని వారిని ఇబ్బందికి గురి చేయడం మంచి పద్దతి కాదని అన్నారు.ఈ మధ్యకాలంలో ఉదయగిరి సామాఇక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఒక స్టాపు నర్సు మీద కొందరు విష ప్రచారం చేస్తున్నారని 35 సంవత్సరాల ఉద్యోగ కెరీర్లో ఎంతోమందికి వైద్యం అందించి నేడు 62 సంవత్సరాల వయస్సు లో తాను ఉద్యోగరీత్యా ప్రతిరోజు ఆసుపత్రికి వచ్చి తన ఉద్యోగాన్ని వయసను సైతం పక్కనపెట్టి శ్రమ కోర్చి ఉద్యోగం చేస్తుంటే కొందరు కనీసం ఆమె వయసుకున్న పరిస్థితిని బట్టి ఆరోగ్యం కూడా అర్థం చేసుకోకుండా మానసిక ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసం అని అన్నారు.ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న మిగితా ఉద్యోగస్తులు ఏ రకమైన ఉద్యోగాలు చేస్తున్నారో ఉదయగిరి ప్రజలందరికీ తెలుసని సామాజిక కేంద్రంలో పనిచేయాల్సిన పరికరాలు ఎందుకు పనిచేయట్లేదని కనీసం ఆసుపత్రికి వచ్చిన ప్రజలకు నీటి సౌకర్యం కల్పించలేదని దుస్థితి నెలకొని ఉందని మరుగుదొడ్ల సౌకర్యం గురించి మాట్లాడాల్సిన అవసరమే లేదని పురుడు కోసం వచ్చిన మహిళను ఉదయం నుండి సాయంత్రం వరకు కూర్చోబెట్టి ఇక్కడ కుదరదు వేరే ఆసుపత్రికి వెళ్లండి అని చెప్పినప్పుడు ఉన్నత డాక్టర్ల డ్యూటీ ఏమైంది అని అన్నారు.ఒకరి ఉద్యోగం ఒకరు చేస్తూ కాలయాపన చేస్తూ నెల జీతాలు తీసుకొని ఇంటికి పోతున్న వారి సంగతేమిటని ఆయన ప్రశ్నించారు.రక్త నమూనా సేకరణ విభాగంలో అటెండర్ గా విధులు నిర్వహించాల్సిన ఉద్యోగి ఎక్రే రూములో కూర్చుని ప్రతిరోజు మాటామంతి మాట్లాడుకొని అటు నుండి అటే ఇంటికి వెళ్తున్నప్పుడు ఉద్యోగ ధర్మం కనిపించలేదా అని ప్రశ్నించారు.తవ్వుకుంటూ పోతే సామాజిక ఆరోగ్య కేంద్రంలో డ్రాయింగ్ ఆఫీసర్ స్థాయి నుండి ఉన్నత డాక్టర్ స్థాయి నుండి వాచ్మన్ ఉద్యోగం వరకు ప్రక్షాళన గురించి మాట్లాడుకోవాల్సి వస్తుందని అన్నారు.పనిగట్టుకుని ఒక వర్గం వారు దళిత వర్గంలోని కొంతమందిని మాత్రమే టార్గెట్ చేసి ప్రివిలిసన్ డ్యూటీలో ఉన్న ఉద్యోగస్తుల మీద తమ జులుం ప్రదర్శిస్తున్నారని ఆయన వాపోయారు.వారానికి మూడు రోజు పని చేస్తూ నాలుగు రోజులు సెలవు పెట్టి ఇంటి దగ్గర కూర్చొని జీతాలు తీసుకుంటున్న వారి సంగతేమిటని ఆ ఉద్యోగస్తులు..ఈ నిజాయితీపరుల కళ్ళకు కనిపించట్లేదా అని ఆనయ ప్రశ్నించారు.ఉద్యోగరీత్యా ఏదైన సమస్యలు ఉంటే వారు సరిగా డ్యూటీ చేయకపోతే డ్యూటీలో నిర్లక్ష్యం వహిస్తే ఎవరినైనా ఉపేక్షించాల్సిన అవసరం లేదని ఉన్నత అధికారులు దృష్టికి వారి చర్యలను తీసుకెళ్లొచ్చు అని అందుకు ఎవరు అతీతులు కాదని అన్నారు.24 గంటలు నేను పేద ప్రజలకు అండగా ఉండి వైద్యం అందిస్తున్నానని చెప్పుకుంటున్నా కొంతమంది వైద్యులు హాస్పిటల్ ను తమ సొంత ఇల్లు లాగా ఉపయోగించుకుంటూనే ప్రభుత్వం దగ్గర హౌస్ రెంట అలవెన్స్ తీసుకుంటున్న సంగతి అందరికీ తెలిసిందే.అమాయక పేద ఉద్యోగులు ఏదైనా ఆరోగ్యం సరి లేనప్పుడు(క్లాస్ 3,4)మెడికల్ సర్టిఫికెట్ కోసం వైద్యులను అడిగితే వందల్లో వెలల్లో డబ్బులు వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చినది.ఇది సరైన పద్దతి కాదు అని మేము తెలియజేస్తున్నాం..కానీ కావాలని కొందరి తప్పులను కప్పిపుచ్చుకోవటానికి దళిత బిడ్డల ఉద్యోగస్తుల మీద జులం ప్రదర్శించాలని చూస్తే ఆయా ఉద్యోగస్తులకు దళిత సంఘాలు తోడు ఉన్నాయన్న సంగతి మర్చిపోవద్దని ఆయన హెచ్చరించారు

## వైసీపీ కార్యకర్తల మీద దాదులు అమానుషం



**ఉదయగిరి, ఆగష్టు 3,ప్రభాతవార్త** : ఉదయగిరి నియోజకవర్గంలోని దుత్తలూరు మండలం నందిపాడు గ్రామంలో గల సర్వే నెంబర్ 258 బి 1 లో 72 సెంట్ల భూమి క్రేయ విక్రయాల మీద నెలకొన్న సందిగ్ధంలో వైసీపీ టీడీపీకి చెందిన నాయకులు ఒకరినొకరు వాగ్వాదానికి దిగారు.శుక్రవారం జరిగిన ఈ సంఘటనలో టిడిపికి చెందిన నాయకులు జెసిబి సహాయంతో తమ ఇంటి స్థలంలోని కట్టడాలను కూల్చివేశారని బాధితుడు మండ్ల వెంకటేశ్వర్లు ఆరోపించారు.అబానుషంగా దుత్తలూరు మండలానికి చెందిన టిడిపి నాయకులు స్థలాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసిన కూడా రాజకీయ కక్షపూరతంగా తనమీద తన కుటుంబ సభ్యుల మీద దౌర్జన్యంగా దాడులు నిర్వహించి మంది మార్బలంతో జెసిబి తీసుకొచ్చి తన ఇంటిలోని కొన్ని కట్టడాలను కూల్చి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సంఘటన మీద నియాజకవర్గ జిల్లా స్థాయి అధికారులకు తెలియజేశానని.స్థలానికి సంబంధించిన పూర్తి డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని అమ్మకం దారుడు తనమీద స్థలం విషయమై దౌర్జన్యం చేయగా హైకోర్టు నుండి ఇంజెక్షన్ ఆర్డర్ తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు.హైకోర్టు నుండి తనకు అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్ వచ్చిన కూడా స్థానిక టిడిపి నాయకులు తమ మీద జులం ప్రదర్శించి వయస్సు మీద పడిన తన తండ్రి మీద మహిళల మీద దౌర్జన్యం చేశారని దుత్తలూరు మండల వైసీపీ నాయకులు మీడియా సమావేశంలో తెలిపారు.వైయస్సార్సీపి నాయకులు జడ్పిటిసి లెక్కల లక్ష్మీకాంతమ్మ లెక్కల మాలకొండయ్య మండ్ల శివ వెంకట్ రెడ్డి మండ్ల ఆశోక్ తదతరులు దుత్తలూరు వైసీపీ మండల కన్వీనర్ వాసుదేవ రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి బాధ్యుల మీద కటిన చర్యలు తీసుకోవాలని కోరారు.రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత వైసీపీ నాయకులు మీద కార్యకర్తలమీద దాడులు పెరిగియాని రాజకీయ కక్ష సాధించడానికి తెలుగుదేశం పార్టీ నాయకులు అడ్డదారులు తొక్కుతున్నారని అన్నారు.ఇంత జరుగుతున్న పోలీసు వ్యవస్థ ప్రేక్షక పాత్ర పోషించడం సరి కాదని అన్నారు.జరిగిన సంఘటన మీద న్యాయ విచారణ కోర్టుల ద్వారా పొందుతామని టిడిపి నాయకుల దాడులకు బెదిరే ప్రసక్తే లేదని ప్రతి కార్యకర్తకు తాము అండగా ఉంటామని వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జి మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు నడుచుకుంటున్నామని ఆయన అన్నారు.

## తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష



**చేజర్ల ఆగష్టు 3 ప్రభాతవార్త** తల్లిపాలు బిడ్డకు మొదట శ్రీరామరక్షగా పనిచేస్తాయని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సురేఖ తెలిపారు. ఈ సందర్బంగా చేజర్ల సెక్టార్ పరిధిలోని తూర్పుకంభంపాడు 1 అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసిడిఎస్ ఆత్మకూరు ప్రాజక్టు సిడిపిఓ సునీలత ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో తల్లిపాల వారోత్స వాలపై అవగాహన కల్పించారు. మొదట బిడ్డకు తల్లిపాలు ఇస్తే అబిడ్డకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవని అన్నారు. పలు వ్యాధుల నుండి నివారించవచ్చునని తెలిపారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సురేఖ, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, రత్నమ్మ, ఎఎన్‌ఎం మస్తానమ్మ, ఆశా పద్మ,వరలక్ష్మీ పాల్గొన్నారు.

## బీచ్ కబడ్డీ పోటీల్లో హోరా హోరీ



**ఇందుకూరుపేట, ఆగష్టు 3, ప్రభాతవార్త** మండలంలోని ఎంకేఆర్ హైస్కూల్లో క్రీడా మైదానంలో జరుగు తున్న పముజుల శ్రీనివాసులు మహాలక్ష్మమ్మ స్మారక 11వ రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఈ పోటీల్లో పురుషులు 13 జట్లు, మహిళలు 13 జట్లు పాల్గొన్నాయి. శనివారం రెండో రోజు జరిగిన పోటీల్లో పురుషుల విభాగంలో శ్రీకాకుళం, విశాఖపట్నం జట్టు తలపడ్డాయి. శ్రీకాకుళం 34 పాయింట్లు విజయం సాధించింది. నెల్లూరు, కర్నూలు మధ్య జరిగిన పోరులో నెల్లూరు 55 పాయింట్లు విజయం సాధించింది. తూర్పు గోదావరి, కడప జట్లమధ్య జరిగిన పోటీల్లో కడప 24 పాయింట్లతో విజయం సాధించింది. అదే విధంగా మహిళల విభాగంలో కడప, అనంతపురం జట్ల మధ్య జరిగిన పోటీల్లో కడప 14 పాయింట్లతో విజయం సాధించింది. గుంటూరు, నెల్లూరు మధ్య జరిగిన పోరులో గుంటూరు 9 పాయింట్లతో విజయం సాధించింది. తూర్పుగోదావరి 4 పాయింట్లతో విజయం సాధించింది. చివరి రోజు ఆదివారం జరగబోయే ఫైనల్స్‌లో విజేతలకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బహుమతి ప్రధానం చేయనున్నట్లు నిర్వాహకులు రవి, దాసరి విజయ్ తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ప్రతిష్ఠమైన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పముజుల రవి, దాసరి విజయ్‌కుమార్, యేకొల్లు పవన్‌రెడ్డి, టి.సుధాకర్‌రెడ్డి, మాదాల రమేష్ నాయుడు, ఏలమంచిలి శ్రీకాంత్ ఉన్నారు.

## కందుకూరు బాలుర పాఠశాల నుండి ఎన్ఎంఎంఎస్ విద్యార్థుల ఎంపిక



**కందుకూరు, ఆగష్టు 3, ప్రభాతవార్త** స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి ఎన్ఎంఎంఎస్ కు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కందుకూరులో 2023-24 విద్యా సంవత్సరంలో 8వ తరగతి విద్యార్థులకు జరిగిన నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ముగ్గురు విద్యార్థులు కే.జోయల్ సుధాకర్, కేకేతన్, బి.రామకృష్ణ ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ఎం.నరసింహమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎం.నరసింహూర్తి మాట్లాడుతూ కందుకూరు బాలుర ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక కావడం పాఠశాలకు పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులకు గర్వకారహని అన్నారు. ఈ విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.12వేలు చొప్పున ఐదు సంవత్సరాలకు రూ.60వేలు లభిస్తుందని తెలిపారు. వీరికి తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయులు షేక్ సంధాని భాష, ఎం.రమణయ్య, ఎస్.విప్రనారాయణ, శ్రీనిధి పి.బాపయ్య, సరస్వతి, పి.మురళీకృష్ణ, పి.ప్రసాదరావు, డి.సుధాకర్‌లను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు. సాధించిన ఎన్ఎంఎంఎస్ సాధించిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా మెరిట్ స్కాలర్‌షిప్ సర్టిఫికేట్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రెటరీ తలపనేని శ్రీనివాసులు, ఎస్.మాధవరెడ్డి, వై.మహల్యారావు, సీహెచ్ వెంకటేశ్వర్లు, జి.వెంకటేశ్వరరావు, కే.రాంబాబు, ఎస్‌డి జిలాని భాష, ఎం.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



**లింగసముద్రం(కందుకూరు) ఆగష్టు 3, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన లింగసముద్రం పంచాయతీలో హరిజన పాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లింగసముద్రం సెక్టార్ సూపర్‌వైజర్ రాధ మాట్లాడుతూ ప్రతి బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలే రక్ష అని బిడ్డకు జన్మనిచ్చిన ప్రతి తల్లి ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మొదటి ఆరు నెలల వరకు మీ శిశువుకు చనుబాలే ఆహారంగా ఇవ్వాలన్నారు. ఆరు నెలల నుండి తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారాన్ని కూడా ఇవ్వాలని, బిడ్డకు మీరు ఎంత ఎక్కువగా చనుబాలు ఇస్తే అంత ఎక్కువగా పాలు ఉత్పత్తి అవుతాయని అన్నారు. తల్లులకు పలు సూచనలు చేశారు. తల్లి ముర్రుపాలు బిడ్డకు అమృతం లాంటివని తెలియజేశారు. అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, ఏఎన్ఎం ఆశా వర్కర్ తల్లులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ స్థాయి భాజాపా సమావేశం



**కందుకూరు, ఆగష్టు 3, ప్రభాతవార్త** స్థానిక భాజాపా పట్టణ శాఖ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశం అసెంబ్లీ సమన్వయకర్త గట్టమనేని హరిబాబు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు సీపారెడ్డి వంశీధర్‌రెడ్డి పాల్గొని రాష్ట్ర పార్టీ నిర్ధేశించిన కార్యక్రమాలైన తల్లికి వందనం పేరుతో చెట్టు నాటే కార్యక్రమం హర్ ఘర్ తిరంగ కార్యక్రమం నిర్వహణ మరియు ఆగష్టు 7వ తేదీన చేనేత ఉత్పత్తులు కొనుగోలు ద్వారా ఆ రంగం అభివృద్ధి కృషికై సలహాలు సూచనలు అందజేశారు. పార్టీ బలోపేతానికి ప్రణాళిక ఏర్పాటు చేసుకుని, బూతు కమిటీలను పటిష్టపరుచుకోవాలని, భర్తీ కానున్న నామినేటెడ్ పదవులలో భాజాపా నాయకులు, కార్యకర్తలకు సముచిత న్యాయం చేయడంలో కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు యారబోలు రాజేష్, య స్వంత్ సింగ్ ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలను ప్రజలకు వివరించి వారిని పథకాలలో భాగస్వామ్యం చేసి పొందులాగున కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పీవీ కృష్ణారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ జొన్నాదుల రాఘవయ్య, కోకన్వీనరన జొన్నాదుల సురేష్, ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు వైకుంటం, మండలాల అధ్యక్షులు వరప్రసాద్‌రావు, సుధాకర్, డేవిడ్, కరుణ, ప్రధాన కార్యదర్శి మురళీధర్, ఉపాధ్యక్షులు మాల్యాద్రి నాయుడు, బొర్రా కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు మువ్వల భూష్య, చిన్ని పాండురంగయ్య, ఉన్నం భాస్కరరావు, నవులూరు రాజేష్, నాగినేని ప్రసాద్, మట్టే ఏడుకొండలు, ఉలవపాడు రాము, ఉన్నపు చంద్రశేఖర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# చెమిర్ధిపాడులో ఎక్కడ మురుగు అక్కడే

### - ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు- ఆందోళన చెందుతున్న ప్రజలు





**గుడ్లూరు, ఆగష్టు 3, ప్రభాతవార్త** పల్లెల్లో పారి శుధ్యం పడకేసింది. ఎక్కడ మురుగు అక్కడే పేరుకు పోయింది. డ్రైనేజీ కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారం పేరుకు పోవడంతో మురుగునీరు ముం దుకు కదలడం లేదు. కొద్దిపాటి వర్షం పడినా, ము రుగునీరు రోడ్లపై చేరడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు రోజుల తరబడి మురుగునీరు నిలిచిపోవడంతో దుర్గంధంతో పాటు దోమలు పెరిగిపోయాయి. దీం తో రాత్రి సమయాల్లో దోమలతో ప్రజలు అల్లాడు తున్నారు. పెరిగిపోతున్న దోమలతో పాటు వాతా వరణం మార్పుతో సీజనల్ వ్యాధులు ప్రబలుతు న్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాలనీలో సమస్య తీవ్రంగా ఉంది. గ్రామీణ రహదారులతో పాటు, మురుగు కాలువలు కూడా సక్రమంగా లేకపోవడంతో ఆయా కాలనీ వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ కాలువలు కూడా సక్రమంగా లేకపోవడంతో మెరుగునీరు రోడ్లపై చేరి రోజులతరబడి నిలిచిపోతుంది. దీంతో రాకపోకలు చేయాలన్న కాలనీ వాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే గ్రామంలో అనేక మంది సీజనల్ వ్యాధులతో బాధపడ్డారు.

## గ్రామీణ హెల్త్ క్లీనిక్ ప్రారంభం ఎప్పుడో..?




**ఉలవపాడు, ఆగష్టు 3, ప్రభాతవార్త** : గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేం దుకు ఆయుష్మామ్ భారత్ పేరుతో కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన విలేజ్ క్లీనిక్ ప్రారంభం కాకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలానుగుణంగా సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజాప్రతినిధులు, వైద్య నిపుణులు సూచిస్తున్నప్పటికి ప్రస్తుత సీజన్‌లో జ్వరాల సంఖ్య పెరగడంతో ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ పరంగా వనరులు ఉన్నప్పటికి పాలకులు, అధికారులు వాటిని విస్మరించడంతో సామాన్యులు కార్పొరేట్ ఆసుప్రతులను ఆశ్రయించక తప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం సైతం ఆయుష్మాన్ భారత్ పేరుతో నెలకొల్పబడిన గ్రామాల్లోని జ్వరపీడితులు సైతం కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించక తప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం సైతం ఆయుష్మాన్ భారత్ పేరుతో నెలకొల్పబడిన గ్రామాల్లోని జ్వరపీడితులు సైతం కార్పొరేట్ ఆసు పత్రులను ఆశ్రయించక తప్పడం లేదు. ఉలవపాడు మండలం బద్దిపూడిలో వైద్యశాల నిర్మాణం పూర్తయినా నేటి వరకు తెలుపులు తెరుచుకోకపోవడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పేద, బడుగు ప్రజలకు సత్వరమే వైద్యం అందుతాయన్న ఆశలు అడియాశలవుతున్నాయని గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత సీజన్లో సీజన్ వ్యాధుల భారిన పడిన రోగులు దూర ప్రాంతాలైన సింగరా యకొండ, ఒంగోలు, కావలి, నెల్లూరు వెళ్లాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ క్లీనిక్‌లు ఇదే తరహాలో దర్శనం ఇవ్వడంతో పేద రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే వర్షాకాలం సీజన్ నేపధ్యంలో సాధారణ, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాల బాధితులు పెరుగుతున్న నేపధ్యంలో తక్షణమే ప్రభుత్వం ఈ విధమైన వైద్యశాలలపై దృష్టి సారించి ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందించబడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## తల్లిపాలు బిడ్డకు వరం లాంటిది



**ముత్తుకూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త** బిడ్డకు తల్లిపాలు వరం లాంటిదని అంగన్‌వాడి సూపర్వైజర్ మంజుల అన్నారు. శనివారం ముత్తుకూరు మండలంలోని బ్రహ్మదేవం పంచాయితీలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు మొదట టీకా అని అన్నారు. తల్లిపాలు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, బిడ్డ రోగాలు బారిన పడకుండా రక్షిస్తుందని అన్నారు. బాలింతలకు కూడా గర్భవతులుతో పాటు అంగన్‌వాడీల్లో పోషక విలువలు ఆహారాన్ని కూడా అందిస్తున్నామన్నారు. ఆరు నెలలు కచ్చితంగా బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు రాజేశ్వరి, సుమలత అంగన్వాడి హెల్పర్లు గీత, శిరీష, ఏఎన్ఎం చంద్రకళ అమృత, ఆశ వర్కర్ సునంద తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ఇళ్ళ పట్టాలు సృష్టించిన వారిపై క్రిమినల్ చర్యలు

**అనంతసాగరం,ఆగస్ట్3,ప్రభాతవార్త** : అనంతసాగరం మండలం బొమ్మవరం మజరా గ్రామమైన అగ్రహారంలో జగనన్న లే ఔట్‌లో ఆ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తహసిల్దార్ సంతకం చేసినట్లు నకిలీ సంతకంతో ఇళ్ళ పట్టాలు సృష్టించారని అలాంటివారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అనంతసాగరం పోలీస్‌శాఖను కోరామని అనంతసాగరం మండల ఇన్‌చార్జ్ తహసిల్దార్ గిరీష్ తెలిపారు. నకిలీ ఇళ్ళ స్థలాల పట్టాలపై విచారించామని వ్యత్యాసాలు గమనించామని తహసిల్దార్ సంతకం ఫోర్జరీ జరిగినట్లు ఆయన తెలిపారు.

## అయ్యప్ప ఆలయం అభివృద్ధి కృషి చేస్తా పావళ్ళ ప్రసాద్



**నెల్లూరు రూరల్, ఆగష్టు 3, ప్రభాతవార్త** నెల్లూరు ప్రముఖ క్షేత్రాల్లో ఒకటైన అయ్యప్ప స్వామి ఆలయం స్వామియే శరణమయ్యప్ప అంటూ మాలధారణ సమయంలో భక్తులతో పొటెత్తుతున్న నెల్లూరు రూరల్ అయ్యప్ప గుడి సెంటర్‌లో ఉన్న అయ్యప్ప ఆలయంలో నూతన ఆలయ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో అతని అనుచరుడుగా గాంధీ నగర్ మాజీ కార్పొరేటర్ భర్త పావళ్ళ ప్రసాద్‌ను నియమించారు. ఎన్నో ఏళ్లగా అయ్యప్ప స్వామి భక్తులకు అండగా ఆలయ అభివృద్ధికి తన సాయిశక్తుల పనిచేస్తానని ఇలాంటి అవకాశం నాకు రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని పావళ్ళ ప్రసాద్ తెలిపారు.

## సిసి రోడ్లు, కల్వర్టు పనులకు రూరల్ ఎమ్మెల్యేచే శంకుస్థాపన

**నెల్లూరు రూరల్, ఆగష్టు 3, ప్రభాతవార్త** నియోజకవర్గ పరిధిలోని 30వ డివిజన్, శ్రామిక నగర్‌లో సుమారు 33 లక్షల రూపాయిల నిధులతో సిసి రోడ్లు, కల్వర్టు పనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య కుటుంబాలు, పేద కుటుంబాలు అధికంగా నివసించే ప్రాంతాలలో కనీస వసతుల కోసం ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఒక జాతరలా పనులు మొదలయ్యాయని ఆయన అన్నారు. ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు చేసినదానికంటే మరో పదింతలు అదనంగా అభివృద్ధి చేయవల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జి మాన్నేపల్లి రఘు, మాజీ ఏఎంసి చైర్మన్ కూకటి హరిబాబు, అత్తివరపు యనదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణపట్నంలో క్లీన్ అండ్ గ్రీన్




**ముత్తుకూరు, ఆగష్టు 3, ప్రభాతవార** కృష్ణపట్నం గ్రామంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని అదాని కృష్ణ పట్నం పోర్టు సహకారంతో అదాని ఫౌండేషన్ కృష్ణపట్నం పంచాయితీ సంయుక్తంగా శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యాక్రమాన్ని చేపట్టారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోర్ట్ కృష్ణపట్నంలోని శివాలయం ప్రాంతం నుంచి పనులు ఫౌండేషన్ హెడ్ రాజేష్ రంజన్ యేకొల్లు కోదండరామయ్య, బొనిగి ఆనందయ్య,గ్రామస్తులు కలిసి ప్రారంభించారు. గ్రామంలోని డ్రైనేజీ కాలువలను క్లీన్ చేయడం మురుగునీరు ఎక్కడ నిల్వ లేకుండా చేయడంతో పాటు గ్రామంలో మొక్కలు నాటి వాటిని సంరక్షణ చేయడం లక్ష్యంగా అదాని ఫౌండేషన్ కృషి చేస్తుందని ఆదాని ఫౌండేషన్ హెడ్ రాజేష్ రంజన్ తెలిపారు. వారం రోజులు పాటున ఈ కార్యక్రమాలు కృష్ణ పట్నంలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామస్తులు సహకారంతో కృష్ణపట్నం గ్రామాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఏర్పాటు చేయుటకు ఆదాని కృష్ణపట్నం పోర్టు ముందుంటుందని తెలిఎపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహణ చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాగాల శివకృష్ణ, టి. శ్రీధర్, పంచాయితీ కార్యదర్శి మస్తానయ్య, వీఆర్‌వో అవినాష్, గోవిం దయ్య, రామకృష్ణ, వెంకటరమణయ్య, అక్కయ్య గారి ప్రసాద్, కరణం నాగరాజు, సురేష్, ఆదిశేషయ్య, అదాని ఫౌండేషన్ ప్రతినిధులు రమేష్ బాబు, రవీంద్ర అరుణతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాఠశాల కమిటీ ఎన్నికల నిర్వహణపై శిక్షణ



**వలేటివారిపాలెం ఆగష్టు 3, ప్రభాతవార్త** స్కూలు మేనేజ్‌మెంటు కమిటీ ఎన్నికలను నిబంధనల మేరకు ఈ నెల 8న నిర్వహించాలని మండల ఎంఈవో ఏ.మల్లిఖార్జునరావు ప్రధానోపాధ్యాయులకు సూచిం చారు.శనివారం మండల విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహి ంచిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో స్కూ లు మేనేజ్‌మెంట్ ఎన్నికల నిర్వహణ విధివిదానాలపై ఆయన శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ రెండేళ్ల కాలపరిమితితో కూడిన కమిటీలను విద్యార్థుల తల్లిదండ్రు లు,ఉపాధ్యాయు లు,ప్రజా ప్రతినిధులు,స్వచ్ఛంద సంస్థల సభ్యులచే ఎంపిక చేయాల్సి ఉందని చెప్పారు.ఇందులో ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనారిటీలకు చెందిన సభ్యులను ఖచ్చితంగా ఎంపికచేయాల్సి ఉందన్నారు.ఈ కమిటీలు తరగతులు నిర్వహణ,నిధుల వినియోగం,ప్రభుత్వ పథకాలఅమలు తీరుతెన్నులును పర్యవేక్షించనున్నాయి.ఇందులో బాగంగా మండలంలో 45ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలు,4ఉన్నత పాఠశాలలు,ఒక కస్తూరిబా విద్యాలయం,మరొక మోడల్ సూ ్కలు వెరసి 51పాఠశాలలకు కమిటీలు ఏర్పాటుచేయాల్సి ఉందన్నారు.ఆయా పాఠశాలల పధానోపాధ్యాయులు ఎన్నికల అధికారులుగా బాధ్యతలు నిర్వహస్తారని తెలిపారు. ఇందుకు సంబందించిన షెడ్యూల్‌ను ఈ నెల1వ తేదీనే విడుదల చేసినట్లు తెలిపారు.8వ తేదీ ఉదయం 7గం॥లనుంచి మధ్యాహ్నం 1గం॥వరకు ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పూర్తి చేయాలని మధ్యాహ్నం 1.30కి ఎంపికైన సభ్యుల నుంచి చైర్మన్,వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవాల్సి ఉందని ఎంఈవో వివరించారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, మన్నం మాధవరావు, గోళ్ల శ్రీనివాసరావు,చిన్నయ్య, ఎజ్రానీ, చల్లా బ్రహ్మయ్య,వలేటి మాలకొండయ , లెనినా,కాంప్లెక్స్ చైర్మన్‌లు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## గోకులం పధకాన్ని సద్వినియోగం చేసుకొండి



**వలేటివారిపాలెం ఆగష్టు 3, ప్రభాతవార్త** ప్రభుత్వం అమలుచేస్తున్న గోకులం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాల పశుసంవర్ధకశాఖ సహాయసంచాలకులు కె.వి బ్రహ్మయ్య పశుపోషకులుకు సూచించారు.ఇందుకు సంబందించిన విధివిదానాలను ప్రకటించామని నిబంధనల మేరకు నిర్దేశిత ధృవపత్రాలను పొందుపరచాలని ఆయన తెలిపారు. లేనిచో సంబందిత ధరఖాస్తులు తిరస్కరించబడతాయిని వివరించారు. పూర్తి వివరాలకు అందుబాటులో ఉన ్న వెటర్నరీ సిబ్బందిని సంప్రదించాలని అన్నారు.

## తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యం



**విడవలూరు,ఆగష్టు 3 ,ప్రభాతవార్త:** మండలం వావిళ్ళ సెక్టార్ పరిధిలోని దండిగుంట వన్ అంగన్వాడి కేంద్రం నందు శనివారం సూపర్వైజర్ బి.రమణి ఆధ్వర్యంలో జాతీయ తల్లిపాలు వాత్స వాలు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు,తల్లులు,క్రమం తప్పకుండా అంగన్వాడి కార్యకర్త చెప్పే విధంగా మందులు వాడుకోవాలని దానివలన పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తల్లులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సంబంధిత సైపర్వైజర్ వెంకటలక్ష్మి,ఏఎన్ఎం,జయంతి,ఎం ఎస్ కె సావిత్రి,అంగన్వాడి కార్యకర్తలు ఎం శిరీష,ఎం వాణి,ఆర్ భారతి ఎన్ శైలజ,బి.జయశ్రీ ఆర్ ప్రసన్న,ఎం లక్ష్మి ఆయాలు తదితరులు పాల్గొన్నారు.